
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 26 మార్చి 2025





వివాదానికి కారణమైన స్థలం

తొలుత నిర్లక్ష్యం...


ఆపై ఓవరాక్షన్

- ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ
- ఆందోళన కారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం

6

నాటి హామీ.. నేడు అమలు

ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ఆంధ్రజ్యోతి వినూత్నంగా చేపట్టిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఏళ్లుగా అపరిష్కృతంగా సమస్యలపై ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు గళం వినిపించగా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నారు.



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..





వినుకొండలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లోని సీసీ రోడ్డు, మురుగు కాల్వ పనుల శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

జనవరి 28న వినుకొండ మున్సిపల్ పరిధిలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లో ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వీధివీధినా పర్యటించగా స్థానికులు తామెదుర్కొంటున్న సమస్యలను వివరించి, అర్జీలను కూడా ఇచ్చారు. ఆ సమయంలో ఆయన ఆయా సమస్యలపై స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారు. నాడిచ్చిన హామీ మేరకు ఆయా ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు నిధులను మంజూరు చేయించి మంగళవారం వాటికి శంకుస్థాపనలు కూడా చేశారు. ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ జీవీని సత్కరించారు. రూ.62.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు.. మురుగు కాల్వల నిర్మాణ పనుల ప్రారంభంపై హర్షం వ్యక్తం చేశారు.



జీవీ ఆంజనేయులను సత్కరిస్తున్న కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు, స్థానికులు

- అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా పనులకు శంకుస్థాపనలు
- వినుకొండ మున్సిపాల్టీలోని కొట్నాల్లవీధి, గాయత్రినగర్‌లకు మహర్దశ
- ఆంధ్రజ్యోతి వేదికగా సమస్యలపై ప్రజాగళం.. పరిష్కారానికి మార్గం సుగుమం
- రూ.62.60 లక్షలతో రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన
- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులను సత్కరించిన కాలనీ వాసులు

వినుకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఆంధ్రజ్యోతి గొంతుకగా మారేందుకు అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోంది. ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించే క్రమంలో జనవరి 28న వినుకొండ మున్సిపాల్టీలోని 23, 31 వార్డుల్లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రజ్యోతి వేదికగా గాయత్రినగర్.. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు కాగా ప్రజలు సమస్యలను తెలియజేసి అర్జీలను అందజేశారు. నాడు హామీ ఇచ్చినట్లుగా ఆయా సమస్యల పరిష్కారానికి జీవీ నేడు నడుంకట్టారు. ఆయా కాలనీల్లో రూ.62.60 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమం ద్వారా తమ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రగతి పనులకు శంకుస్థాపన చేసిన జీవీకి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం : జీవీ

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వినుకొండ (మిగతా 8వ పేజీలో)

గాయత్రినగర్‌లో రూ.45 లక్షలతో వసతులు

కొత్తగా ఏర్పాటైన గాయత్రినగర్‌లో గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదు. అంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జీవీ వీధివీధిలో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేసి తమ ఇబ్బందులను తెలిపారు. నగర్ కాల్వకట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు.. మురుగు కాల్వలు, ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. మరో వీధిలో రోడ్డు, డ్రెయిన్, తాగునీటి పైపులైన్, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు జీవీ మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.45 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశారు. తాగునీటి సమస్యలను పరిష్కరిస్తానని తాజాగా హామీ ఇచ్చారు.

రూ.17.60 లక్షలతో కొట్నాల్లవీధిలో పనులు

పేద ముస్లిం మైనార్టీ వర్గాలు నివసించే కొట్నాల్లవీధి ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైపు లైన్ కోసం సిమెంట్ రోడ్డు పగలగొట్టి వదిలేశారు. మురుగు కాల్వలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. తాగునీటి సమస్యతో అల్లాడుతున్నారు. ఆయా సమస్యలను ఆంధ్రజ్యోతి వేదికగా జీవీకి వారు గతంలో తెలిపారు. ఆ వీధిలో పర్యటించిన జీవీ ఆయా సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడిన జీవీ కొట్నాల్లవీధి అభివృద్ధికి బాటలు వేశారు. రూ.17.60 లక్షలతో ఆ ప్రాంతవాసులు కోరిన ప్రగతి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజల సమక్షంలోనే వారడిగిన పనులకు శంకుస్థాపన చేశారు.

మరో ఆర్వోబీ మంజూరు

- మంగళగిరి - నంబూరు మధ్య ఏర్పాటు
- 4 వరుసలు.. రూ.129.18 కోట్లు కేటాయింపు
- ఖర్చులను పూర్తిగా భరించనున్న కేంద్ర ప్రభుత్వం



నిడమర్రు రైల్వేగేటు

మంగళగిరి, గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైంది. రైల్వే లెవల్ క్రాసింగ్ నెం 14, మంగళగిరి- నంబూరు స్టేషన్ల మధ్య ఈ ఆర్వోబీ రానుంది. ఈ ఆర్వోబీకి మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ ప్రతిపాదించగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కేంద్ర పెద్దలను ఒప్పించారు. మంగళగిరి పాతబస్టాండు సెంటరు నుంచి నిడమర్రు, నీరుకొండ, పెదపరిమి, వడ్డమాను మీదగా అమరావతిని చేరుకునే మార్గంలో మంగళగిరి -నిడమర్రు మధ్య విజయవాడ- గుంటూరు రైల్వేలైనుపై లెవల్ క్రాసింగ్ గేటు ఉంది. ఈ మర్గంలో నిత్యం 70కి పైగా రైళ్లు, గూడ్స్‌లు రాకపోకలతో ప్రతి ఐదు, పది నిమిషాలకు గేటు పడుతూ ఉంటుంది. దీంతో నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటు కారణంగా ఈ ప్రాంత అభివృద్ధి కూడా కుంటుపడింది. నిడమర్రును ఆనుకుని రాజధాని నవనగరాల్లో ప్రధాన మైన ఎలక్ట్రానిక్ సిటీ, హెల్త్ సిటీలు ఏర్పాటవుతున్నాయి. ఇంకో పక్క అమరావతి టౌన్‌షిప్‌లోనే ఆంధ్రా క్రికెట్ అకాడమీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించింది. ఈ నేపథ్యంలో నిడమర్రు రైల్వేగేటు అడ్డంకిగా మారింది. ఈ రైల్వేగేటు స్థానంలో ఆర్వోబీని నిర్మిస్తే అది రాజధాని అభివృద్ధికి దోహదపడుతుందన్న అంచనాలు (మిగతా 8వ పేజీలో)

వృద్ధి లక్ష్యం.. 17.66%

- తలసరి ఆదాయం రూ.3,54,268
- కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం నిర్దేశం
- పలు అంశాల్లో జిల్లా వెనకబడిందన్న సెక్రటరీలు

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరంలో జిల్లా తలసరి ఆదాయం రూ.3 లక్షల 54 వేల 268 లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.3 లక్షల వెయ్యి 107గా అంచనా వేసింది. లక్ష్యాన్ని చేరుకోవాలంటే రూ.53,162 పెరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉన్నది. 17.66 శాతం వృద్ధిని తలసరి ఆదాయంలో సాధించాలని లక్ష్యంగా పేర్కొన్నది. మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల మూడో కలెక్టర్ల సదస్సు తొలి రోజున వివిధ శాఖల అధికారులు జిల్లా ఏ స్థానంలో ఉన్నది వంటి వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నివేదించారు. తలసరి ఆదాయం 2022-23లో రూ.2,31,287, 2023-24లో రూ.2,71,087గా ఉందని గణాంకాలతో ప్లానింగ్ సెక్రటరి వివరించారు. జీడీడీపీలోనూ 17.96 శాతం వృద్ధిని సాధించాలని, రాబోయే ఆర్థిక సంవత్సరంలో 89,639కి చేరుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర జీడీడీపీలో జిల్లా వాటా 4.80కి చేరుకోవాలని సూచించింది. జిల్లాలో ఇంకా 3,668 మంది ఆచూకీ తెలియడం లేదని, ఈ విషయంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ నాగలక్ష్మికి ప్రభుత్వం సూచించింది. 3978 కుటుంబాలకు సంబంధించి ఇంటి ఫొటో, జియో కోఆర్డినేట్స్‌ని సేకరించాలని ఆదేశించింది. నేటికీ 14,155 మంది పిల్లలకు ఆధార్ నంబర్లు లేవని, వీటిపై దృష్టి పెట్టాలని సంబంధిత సెక్రటరి సూచించారు. వర్క్ ఫ్రం హోం సర్వేని ఇంకా 5 లక్షల 4 వేల 984 మందిని చేయాల్సి ఉన్నదని చెప్పారు. గ్రీవెన్స్‌కు సంబంధించి ఆడిట్ ఇంకా 21.44 శాతం పెండింగ్‌లో ఉన్నది. స్టార్ రేటింగ్స్ విషయంలో గుంటూరు చాలా వెనకబడి ఉన్నది. ఫిర్యాదుల పరిష్కార సమయంలో 14 శాతం మంది అధికారుల ప్రవర్తన తీరు సరిగా లేదు. పీజీఆర్ఎస్ స్కోర్ కార్డులో గుంటూరు జిల్లా చివరి నుంచి నాల్గో స్థానం నిలిచింది. ఈ నేపథ్యంలో పీజీఆర్ఎస్‌పై మరింత దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పీఎం సూర్యఘర్ స్కీమ్ కింద రాబోయే ఆర్థిక సంవత్సరంలో 70 వేల యూనిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.



సదస్సులో ఎస్పీ సతీష్‌కుమార్, కలెక్టర్ నాగలక్ష్మి

నేడు ప్రజంటేషన్ ఇవ్వనున్న కలెక్టర్ నాగలక్ష్మి

2025-26 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖల పరంగా రూపొందించిన కార్యచరణ ప్రణాళికపై కలెక్టర్ల సదస్సు రెండో రోజైన బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. వ్యవసాయ సంబంధిత రంగాల్లో 14.90 శాతం, పరిశ్రమల్లో 21.29 శాతం సర్వీసు సెక్టార్‌లో 16.48 శాతం వృద్ధి రేటు సాధించేందుకు లక్ష్యంగా కలెక్టర్ పెట్టుకున్నారు. తద్వారా ప్రభుత్వం జీడీవీఏలో ఆశిస్తున్న 17.36 శాతం, జీడీడీపీలో 17.96 శాతం, తలసరి ఆదాయంలో 17.66 శాతం లక్ష్యాలను అధిగమిస్తామని నివేదించనున్నారు. గుంటూరులో యూజీడీని పూర్తి చేసేందుకు ఆర్థికంగా సాయం అందించాలని, మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌కు అండర్ గ్రౌండ్ సీవరేజ్ సిస్టమ్‌ని మంజూరు చేయాలని, సమగ్ర తాగునీటి పథకం కోసం రూ.111.50 కోట్ల నిధులు అవసరమని నివేదించనున్నారు. గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.625 కోట్లు, పొడిగింపునకు రూ.381.341 కోట్లు, చినకాకాని, మల్లాయపాలెంలో పారిశ్రామికవాడల ఏర్పాటుకు రూ.170 కోట్లు, జీజీహెచ్‌లో నిర్మించిన మేటర్నిటీ వార్డులో పరికరాలకు రూ.30 కోట్లు అవసరమని కోరనున్నారు.



కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేయర్ సజీల

మేయర్ కావటి రాజీనామాకు ఆమోదం

- ప్రభుత్వానికి పంపాలని కౌన్సిల్ తీర్మానం
- మరోసారి కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న వైసీపీ కార్పొరేటర్లు
- సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన వైసీపీ కార్పొరేటర్లు, ఎమ్మెల్సీలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మేయర్‌గా కావటి మనోహర్‌నాయుడు చేసిన రాజీనామాను నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. ఈ మేరకు మంగళవారం ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల అధ్యక్షతన ఒకే ఒక అంశం మేయర్ మనోహర్‌నాయుడు రాజీనామా ఆమోదంపై కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన రాజీనామాను కౌన్సిల్ ఆమోదించి, దానిని ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించారు. తొలుత రాజీనామా అంశంపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. దీంతో మేయర్‌గా మనోహర్‌నాయుడు చేసిన రాజీనామా సక్రమంగా లేదని డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు తెలిపారు. ఈ క్రమంలో డైమండ్‌బాబు, కమిషనర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. మనోహర్ నాయుడు ఈ నెల 15న తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి కలెక్టర్ నాగలక్ష్మికి పంపించారని కమిషనర్ తెలిపారు. న్యాయ సలహా తీసుకుని మరోసారి సమావేశం నిర్వహించాలని, అప్పటివరకు సమావేశాన్ని వాయిదా వేయాలని (మిగతా 6వ పేజీలో)



90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

సీఆర్డీఏ కార్యాలయంలో పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

- త్వరలో అందుబాటులోకి రాజధాని భవనాలు
- డెడ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని నిర్దేశించాం
- ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ

8

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (బుధవారం సాయంత్రం)

సహరి : 4.51 (గురువారం ఉదయం)

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు



8

మిర్చి యార్డు ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు

తొలుత నిర్లక్ష్యం... ఆపై ఓవరాక్షన్

ఫిరంగిపురం స్థల వివాదంలో అతిగా స్పందించిన సీఐ

రివాల్వర్‌తో యువకుడుపై దాడి... కాల్చేస్తానంటూ ఆందోళనకారులకు హెచ్చరికలు

రెచ్చగొట్టేలా వ్యవహరించడం వల్లే ఉద్రిక్త పరిస్థితి

ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కర్రలతో సీఐ వెంటబడిన వైనం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :: ఫిరంగిపురంలోని శాంతిపేటలో స్థల విషయంలో నెలకొన్న వివాదాన్ని అంచనా వేయడంలో స్థానిక సీఐ రవీంద్రబాబు విఫలమయ్యారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం తీర్మానించిన గ్రామకంఠం స్థలంలో ఇప్పటికే రెండు సెంట్లు కబ్జాకు గురైందని... మరో రెండు సెంట్లు స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని కాలనీవాసులు తొలుత ఫిరంగిపురం స్టేషన్ వెళ్లి సీఐకు ఫిర్యాదు చేశారు. గేర చిన్ని కుమార్ అనే వ్యక్తి ఆ స్థలంలో పోల్స్ పాదుతున్నాడని, ఆ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని తొలుత కాలనీవాసులు సీఐను కలిసి విజ్ఞప్తి చేశారు. అయితే సీఐ రవీంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరించారు. ఏదైనా ఉంటే తహసీల్దార్ కలిసి తేల్చుకోవాలని, తనకు సంబంధం లేదని చెప్పారు. రాత్రివేళ తహసీల్దార్ అందుబాటులో ఉండరని, కనీసం రేపు తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేసే వరకైనా అందులో ఎటువంటి నిర్మాణాలు జరగకుండా చూడాలని కోరినా నోసెమిరా అంటూ సీఐ వారిని అక్కడ నుంచి పంపించేశారు. దీంతో కాలనీవాసులంతా అక్కడికి వెళ్లి చిన్ని కుమార్ పోల్స్ పాతకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో వివాదం చోటుచేసుకుంది. విషయం పోలీసుల దృష్టికి రావడంతో తొలుత కానిస్టేబుల్, ఏఎస్ఐను అక్కడికి పంపారు. వారు ఇరు వర్గాలతో చర్చించి చిన్ని కుమార్ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా నియంత్రించ గలిగినట్లయితే వివాదం జరిగి ఉండేది కాదు. పెద్ద సంఖ్యలో కాలనీ వాసులంతా అక్కడకు చేరిన విషయం తెలుసుకున్న తర్వాత అక్కడకు వెళ్లినప్పటికీ ఇరు వర్గాలతో సంయమనంతో వ్యవహరించి సామరస్యంగా ఇరువర్గాలను అక్కడి నుంచి పంపాల్సి ఉన్నప్పటికీ సీఐ రవీంద్రబాబు అతిగా స్పందించారు. కమ్యూనిటీ స్థలం కబ్జా కాకుండా కాపాడాలంటూ నిరసన తెలియజేస్తున్న వారిలో ఒకరైన పసల అఖిల్‌ను రివాల్వర్‌తో కొట్టడంతో ఆయనకు రక్త గాయం అయింది. తాము ముందుగా స్టేషన్‌కి వెళ్లి పోల్స్ పాతకుండా స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని కోరితే పట్టించుకోకపోగా తాము నిరసన తెలియజేస్తుంటే వచ్చి ఇరు వర్గాలను నియంత్రించకపోగా తమపై దాడి చేసి రివాల్వర్‌తో కొట్టడం ఏమిటి అంటూ స్థానికులు రెచ్చిపోయారు. సీఐ పై దాడికి యత్నించారు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో సీఐ పక్కనే ఉన్న కాలువలో పడిపోయారు. ఆందోళనకారులు రెచ్చిపోతుండటంతో సీఐ కూడా అగ్గికి ఆజ్యం పోసినట్లు రివాల్వర్ తీసి కాలుస్తానంటూ బెదిరించడంతో వారు మరింత రెచ్చిపోయారు. అయినప్పటికీ సీఐ రివాల్వర్ చేతిలో పట్టుకొని బెదిరిస్తుండడంతో ఆందోళనకారులు రాళ్లు విసురుతూ, కర్రలు తీసుకొని వెంట పడగా ఆయన తుపాకీ చూపిస్తూ వెనక్కు నడుస్తూ ఘటనా స్థలం నుంచి వెళ్లే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు రాళ్లు రువ్వుతూ, కేకలు వేస్తూ వెంటపడంతో అటుగా వచ్చిన ద్విచక్రవాహం ఎక్కి పారిపోయారు. దీంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో గుంటూరు - కర్నూలు రహదారిపై బైఠాయించి సోమవారం అర్ధరాత్రి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. మరోవైపు ఆందోళన కారుల నిరసనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక జిల్లా కేంద్రం నుంచి ఎస్పీ ఆదేశాల మేరకు పెద్ద సంఖ్యలో పోలీసు బలగాలు, తుళ్లూరు డీఎస్పీ, నిఘా విభాగం అధికారులు హుటాహుటిన అర్ధరాత్రి వేళ ఫిరంగిపురం చేరుకొని పరిస్థితి చేయి దాటకుండా శాంతియుతంగా పరిస్థితిని అదుపులోకి తీసుకు రాగలిగారు.



తహసీల్దార్ ప్రసాదరావుకు వినతిపత్రం అందజేస్తున్న శాంతిపేట వాసులు

అసలు స్థల వివాదం ఏమిటంటే...

ఫిరంగిపురంలోని శాంతిపేటలో నాలుగు సెంట్లు ఖాళీ స్థలం ఉంది. గతంలో ఆ స్థలంలో గ్రామదేవత పోలేరమ్మ విగ్రహాలు ఉండేవి. కాలక్రమంలో ఆలయానికి ఆదరణ కొరవడడంతో శిథిలావస్థకు చేరింది. చివరకు అందులో ఉన్న విగ్రహాలను కూడా తొలగించారు. అయితే ఆ నాలుగు సెంట్లు స్థలంలో గేరా చిన్ని కుమార్ అనే వ్యక్తి రెండు సెంట్ల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారు. దీంతో కాలనీవాసులు మిగిలిన రెండు సెంట్ల స్థలంలో కాలనీ అంతటికీ ఉపయోగపడేలా కమ్యూనిటీ హాలు నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆ స్థలం తనదేనని కమ్యూనిటీ హాల్ ఎలా నిర్మిస్తారంటూ చిన్ని కుమార్ కొద్దిరోజులుగా కాలనీవాసులతో గొడవ పడుతున్నాడు. అంతేగాక ఆయన పోలీస్ స్టేషన్లో కాలనీవాసులుపై ఫిర్యాదు కూడా చేశాడు. అయితే కాలనీవాసులు మాత్రం ఇది ప్రభుత్వ భూమి అని, ఇది గ్రామకంఠమని ఇప్పటికే రెండు సెంట్లు ఆక్రమించాడని మిగిలిన రెండు సెంట్లు కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని అందులో ఎట్టి పరిస్థితిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిందేనని పట్టుపట్టారు. దీంతో ఈ వ్యవహారం ఇది మరింత వివాదాస్పదంగా మారింది.

సాంకేతిక నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు (విద్య)మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించవచ్చునని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జరిగిన ఉద్యోగ విజయోత్సవ, వార్షికోత్సవంలో ఆలపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్



విద్యార్థికి నియామక పత్రం అందజేస్తున్న, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

కళాశాలలో చదివిన విద్యార్థులు ఎంతో నైపుణ్యంతో ఉంటారని వారికి అదనపు సాంకేతిక నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం కల్పిస్తే అనేక రంగాల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్.ఎంఏవీ రామకృష్ణ, ఎంబీటీఎస్ ప్రధానాచార్యులు తాళ్లూరి శేఖర్ తదితరులు మాట్లాడుతూ చివరి సంవత్సరం పాలిటెక్నిక్ చదువుతున్న 262 మంది విద్యార్థులకు గాను 252 మంది వివిధ కంపెనీలలో ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. వార్షిక వేతనం రూ.1.8 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంబీటీఎస్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కే హరీష్, వసంత ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కొండేపాటి హనుమంతరావు, రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీవీ శేషా చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ దూరవిద్య ఎంబీఏ అర్హత పరీక్షా ఫలితాల విడుదల

పెదకాకాని, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దూరవిద్య కేంద్రం ఈనెల 23న నిర్వహించిన ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాల అర్హత పరీక్షా ఫలితాలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే గంగాధరరావు విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షల ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ మాట్లాడుతూ ఎంబీఏ కోర్సుకు 285 మంది దరఖాస్తు చేసుకోగా 257 మంది అర్హత సాధించారని, ఎంసీఏ కోర్సుకు 57 మంది దరఖాస్తు చేసుకోగా 54 మంది అర్హత సాధించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల ఫలితాలను దూర విద్యా కేంద్రం వెబ్ సైట్‌లో పొందుపరిచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఓఎస్డీ రవికుమార్, దూరవిద్య కేంద్రం అధికారులు కృష్ణవేణి, నేలపాటి నాగేశ్వరరావు, ఎల్ఎస్ రాంబాబు, జె.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొలనుకొండ మహిళ హత్యకేసులో ఇద్దరు అరెస్టు

తాడేపల్లి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుకొండ గ్రామ శివారులో జరిగిన మహిళ హత్య కేసులో ఇద్దర్ని అరెస్టు చేసినట్లు నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కల్యాణరాజు తెలిపారు. ఈ మేరకు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి కేసు వివరాలు వెల్లడించారు. తాడేపల్లి రాధారంగనగర్‌కు చెందిన ముత్యాల కోమలకుమార్ అలియాస్ చింటు, విజయవాడ రాణిగారి తోటకు చెందిన హిజ్రా బత్తుల శశి అలియాస్ జెస్సీలను అరెస్టు చేశారు. ఈ నెల 23న కొలనుకొండ హైవే సమీపంలో గుంటూరు ఛానల్ వద్ద హత్యకు గురైన మహిళ పామర్రుకు చెందిన సజ్జా తిరుపతమ్మగా గుర్తించారు. భర్త పదేళ్ల క్రితం చనిపోగా, ఇద్దరు పిల్లలతో ఏడాది నుంచి విజయవాడ రాణిగారి తోటలో నివాసం ఉంటుంది. కేటరింగ్ పనులు చేసుకుంటూ అదే ప్రాంతంలో ఉండే ట్రాన్స్ జెండర్ బత్తుల శశితో పరిచయమైంది. మృతురాలికి ముత్యాల కోమలకుమార్‌తో వివాహేతర సంబంధం ఉంది. రెండు నెలల నుండి రాజేష్ అనే అతనితో మృతురాలు సన్నిహితంగా వుంటుంది. ఈ క్రమంలో శశి భర్త నవీన్‌కు కూడా తిరుపతమ్మపై కోరిక ఉందన్న విషయం శశి గమనించింది. తన భర్త ఎక్కడ దూరమవుతాడోనని శశి, తనను వదిలి రాజేష్‌తో క్లోజ్‌గా ఉంటుందని తెలిసిన కోమలకుమార్ ఇద్దరు తిరుపతమ్మను ఎలాగైనా హత్య చేయాలని పథకం పన్నారు. ఈ నెల 23న తిరుపతమ్మ వడ్డేశ్వరం గ్రామంలో తెలిసిన వారిని కలవడానికి రాగా, ఇప్పటం రోడ్డులో గుంటూరు ఛానల్ వద్ద వీరిరువురు తిరుపతమ్మను అడ్డగించారు. శశి మృతురాలిని గట్టిగా పట్టుకోగా కోమల కుమార్ కత్తితో మెడపై పొడవగా బలమైన రక్తగాయాలై ఆమె అక్క డికక్కడే మృతిచెందింది. కాగా నేరం వేరే వారి పైకి వెళ్లేవిధంగా పక్క దారి పట్టించేందుకు ఒక జత చెప్పులు, షర్టు ఉన్న కవర్‌ను నేరస్థ లంలో పెట్టి నిందితులు ఇరువురు పారిపోయారు. అనంతరం పోలీసు లు తమదైన శైలిలో విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేశారు.

1,39,165 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,44,172 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,39,165 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10000	12000
334	9500	12600	బ్యాడిగి 355	10000	13000
నంబరు. 5	10000	13100	సింజెంటా		
273	10000	12600	బ్యాడిగి 5531	10000	12000
341	10000	14000	దేవనూరు డీలక్స్	10200	12500
4884	10000	11400	ఆర్మూరు	10000	11200
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10000	13100			

రూ.2వేల కోట్లకు పైగా సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి) : గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంగం డెయిరీ టర్నోవర్ రూ.2వేల కోట్ల మైలు రాయిని అధిగమించిందని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వడ్లమూడి సంగం డెయిరీ ప్రాంగణంలో మంగళవారం పాలకవర్గ సమావేశం జరిగింది. పలు అంశాలపై చర్చించిన పాలకవర్గం వాటిని ఆమోదించింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సంగం డెయిరీ రోజుకు 10.5లక్షల లీటర్ల పాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. మరో 14 చిల్లింగ్ సెంటర్లను కొత్తగా ఏర్పాటు చేసి అదనంగా రోజుకు లక్షన్నర లీటర్ల పాలను సేకరించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.2,200కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. వాల్యూయాడెడ్ ప్రొడక్ట్ బటర్, పన్నీరు వంటి ఉత్పత్తులతో పోటీ ప్రపంచంలో మరింత నాణ్యతగా అందించేందుకు రు.5కోట్ల మిషనరీ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కొత్తరకం నెయ్యి ఉత్పత్తులు మార్కెట్లోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సంగం డెయిరీలో ప్రస్తుతం 8లక్షల లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్, మిర్యాలగూడలో లక్షన్నర లీటర్ల ప్రాసెసింగ్ యూనిట్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది రైతులకు 50కోట్ల బోనస్ పంపిణీ చేయాలని పాలకవర్గం ఆమోదించిందన్నారు. నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాల్లో సంగం ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని భవిష్యత్‌లో చెన్నైలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే దాణాలు కూడా కొత్తరకం దాణాలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. పడ్డ దూడల ఉత్పత్తికి ప్రారంభించిన సెక్సెడ్ సెమెన్ ప్రాజెక్ట్ ద్వారా 2వేల పశువులకు సెమెన్ అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో 10వేల పశువులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సెమెన్ అందించి పడ్డ దూడల పెంపకు ప్రాజెక్ట్ పనిచేస్తుందన్నారు. అధిక దిగుబడులు ఇచ్చే బీపీటీ మినుము విత్తనాలను మార్కెట్లో సంగం బ్రాండ్ పేరుతో తీసుకురానున్నట్లు తెలిపారు. పశువుల కోసం మేలైన గడ్డి జాతి విత్తనాలు అభివృద్ధి చేసి దేశంలోనే 15మిల్క్ యూనియన్లకు అందజేస్తున్నామన్నారు. త్వరలోనే అరబ్ దేశాలతో పాటు అమెరికాకు సంగం ఉత్పత్తులు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు అన్నిరకాల సేవలదించేందుకు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చైర్మన్ నరేంద్రకుమార్ వివరించారు. ఈ సమావేశంలో సంగం ఎండీ గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

మేయర్ కావటి రాజీనామాకు ఆమోదం

(5వ పేజీ తరువాయి)

వైసీపీ కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. ఆపై సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తూ కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం బయటికి వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర(నాని), టీడీపీ, జనసేన కార్పొరేటర్లు కావటి రాజీనామా తీర్మానానికి ఆమోదం తెలిపారు. తదుపరి చర్యలు తీసుకోవాలిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలని తీర్మానించారు.



కౌన్సిల్ బయట మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్లు



కౌన్సిల్ సమావేశాన్ని బాయ్ కట్ చేసి బయటికి వెళ్లిపోతున్న వైసీపీ ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, ఏసు రత్నం, కార్పొరేటర్లు

వాకౌట్ హాస్యాస్పదం : టీడీపీ

మనోహర్‌నాయుడు రాజీనామాను కౌన్సిల్లో మెజార్టీ సభ్యులు ఆమోదించారని ఎమ్మెల్యే నసీర్, మాధవి, టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర(నాని) తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతోనే కౌన్సిల్ జరిగిందన్నారు. అయినా వైసీపీ సభ్యుల వాకౌట్ హాస్యాస్పదమన్నారు.

నిబంధనల ప్రకారం జరగలేదు : వైసీపీ

మున్సిపల్ చట్టంలోని నిబంధన ప్రకారం మేయర్ రాజీనామా జరగలేదని వైసీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ఆ పార్టీ కార్పొరేటర్లు మీడియాకు తెలిపారు. కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మేయరు స్వయంగా ప్రకటించుకోవాలని, లేదంటే రాజీనామా లేఖను కౌన్సిల్ సెక్రటరీకి మాత్రమే పంపాలని డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు తెలిపారు. అయితే ఇక్కడ మనోహర్ నాయుడు రాజీనామా ప్రక్రియ ఆ విధంగా జరగలేదన్నారు. కలెక్టర్‌కు రాజీనామా ఇస్తే ఏ విధంగా ఆమోది స్తారని ఆయన ప్రశ్నించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్'(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. రాష్ట్రస్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి చైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషనర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఉంటారు. జిల్లాస్థాయి కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా, ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

ప్రణాళికబద్ధంగా ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి చర్యలు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు మెడికల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేసేందుకు తగిన కార్యాచరణ అమలు చేస్తున్నట్లు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి సంఘం కో చైర్మన్ మహమ్మద్ నసీర్ అహ్మద్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వాస్పత్రిలో వివిధ వైద్య విభాగాధిపతులు, పరిపాలన, ఇంజనీరింగ్ అధికారులతో ఆసుపత్రి అభివృద్ధిపై ఆయన సమీక్ష నిర్వహించారు. వివిధ వైద్య విభాగాలకు అవసరమైన ముఖ్యమైన వైద్య పరికరాల వివరాలను సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, హెచ్‌వోడీలకు సూచించారు. ఈ వైద్య పరికరాలను సమకూర్చే బాధ్యత తాము తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న బయో మెడికల్ ఎక్విప్‌మెంట్లను సరిగా వినియోగించుకోవాలని ఆయన తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద వివిధ పరిశ్రమల నుంచి నిధులు సేకరించి వాటితో వైద్య పరికరాలు కొనుగోలు చేస్తామన్నారు. ఇక ప్రభుత్వం నుంచి కూడా అవసరమైన పరికరాలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతినెల 25వ తేదీన ఆయా వైద్య విభాగాధిపతులు తమ వార్డుకు అవసరమైన వైద్య పరికరాల వివరాలను లిఖితపూర్వకంగా సూపరింటెండెంట్‌కు తెలియజేయాలన్నారు. ఈ ప్రక్రియ ఇకపై నిరంతరం జరగాలన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ మాట్లాడుతూ రోగుల సమస్యల పరిష్కారానికి సాహో జీజీహెచ్, మీకోసం మేము వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ సయ్యద్ రసూల్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, కార్పొరేటర్ పోతురాజు సమత, రిటైర్డ్ ఈఈ వై.అశోక్ కుమార్, వైద్య విభాగాధిపతులు, పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సుదీక్షణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన విద్యార్థికి సుదీక్షణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే కృత్రిమ కాలు అందించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదం కారణంగా తమ కుటుంబంలో జరిగిన అన్యాయం మరెవరికి కలగకూడదనే సంకల్పంతో సుదీక్షణ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సుదీక్షణ్ ఫౌండేషన్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, బ్రహ్మసాని శ్రీనివాసరావు, రవి మాస్టర్, మల్లెంపుడి శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పైశాచిక పాలనలో ఉరికొయ్యపై రైతు

● మన్నవ మోహనకృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పీడ కలలాంటి జగన్ పాలనతో రైతులు ఉరికొయ్యలపై వేలాడారని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైనాట్ 175' అంటూ ప్రగల్భాలకు పోయి 11 సీట్లతో చెంపదెబ్బలు కొట్టించుకున్నప్పటికీ జగన్‌రెడ్డి తీరులో ఏమాత్రం మార్పురాలేదని అయన విమర్శించారు. దారుణ ఓటమి తరువాత నానా తిప్పలు పడి ప్రజా సమస్యలంటూ రోడ్డు మీదకు వస్తున్న జగన్‌కు సొంత నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు సోమవారం సొంత నియోజకవర్గం పులివెందులలో పర్యటించిన జగన్‌కు అక్కడున్న స్థానిక ప్రజల నుంచి షాక్ ఎదురైందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ పెంచాలన్న జగన్‌కు అక్కడున్న అధికారులు, ప్రజలు షాకిచ్చారన్నారు.

కవులకు అధ్యయనం అత్యవసరం

● కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సాహిత్య రంగంలో రాణించాలనుకునే కవులు, రచయితలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని, అప్పుడే వారిలో సాహిత్యంపై సరైన అవగాహన ఏర్పడుతుందని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. వేమన కవితామయం, తపస్వీ మనోహరం సంయుక్తంగా నిర్వహించిన కవితా సంపుటల పురస్కారాల ప్రదానసభ శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారంశెట్టి హాజరై మాట్లాడుతూ.. భాష, భావం బలంగా చెప్పే అవకాశం దొరుకుతుందని, పరిశీలనా దృష్టితో చదివి అవగాహన చేసుకుని నిర్దిష్టమైన భావాలతో తమ గళాన్ని బలంగా వినిపించినప్పుడే సాహిత్య రంగంలో నిలుదొక్కుకోగలరన్నారు. అనంతరం అతిథి చేతుల మీదుగా కుమార్ రాజును ఘనంగా సత్కరించి ఉగాది పురస్కారంను అందించారు. గుంటూరు జిల్లాకు చెందిన బుర్రి కుమార్ రాజుకు పురస్కారం లభించడంపై జిల్లా రచయితల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసారు. పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలావృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ), కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు)లకు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమానికి ఈ.వేమన అధ్యక్షత వహించారు. సభలో సురంగీ మోహనరావు, జంధ్యాల శరత్ బాబు, ఈ వేమన, బుర్రి కుమార్ రాజు, బలివాడ తేజస్వినిలు ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి అనేకమంది కవులు, రచయితలు హాజరయ్యారు.



ఉగాది పురస్కారం అందుకున్న ఆంధ్ర ప్రదేశ్ రచయితల సంఘ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు

వీధి వ్యాపారులపై వేధింపులు ఆపాలి



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు (తూర్పు), మార్చి 25(ఆంధ్ర జ్యోతి): వీధి వ్యాపారులపై నగరపాలక సంస్థ అధికారులు చేస్తున్న దాడులు, వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో కమిషనర్ పులి శ్రీనివాసులు వీధి వ్యాపారుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండానే వ్యాపారాలు మూసివేయాలని, తోపుడు బళ్ళు తీసివేయాలని ఆదేశాలు జారీ చేయడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరించి పులి శ్రీనివాసులు పని చేస్తున్నారని మండిపడ్డారు. వేలాది వీధి విక్రయదారుల కుటుంబాల జీవితాలను సర్వనాశనం చేస్తూ ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మేడా హనుమంతురావు, పుప్పాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకార సంవత్సరంగా 2025

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్య సమితి 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందని జేసీ భార్గవ్ తేజ అన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో ఆయన అధ్యక్షతన మంగళవారం జిల్లా కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సమయపాలనతో కూడిన జిల్లా స్థాయి ప్రణాళికలు, వార్షిక కార్యాచరణతో కూడిన నెల వారి క్యాలెండర్‌ను కమిటీ ఆమోదించడం జరిగిందన్నారు. ఏప్రిల్ 7వ తేదీన వరల్డ్ హెల్త్ డే సందర్భంగా మహిళలకు హెల్త్ క్యాంప్ నిర్వహించడానికి డీఎం అండ్ హెచ్‌ఓతో పాటు, జిల్లా స్థాయి సెమినార్ ను జిల్లా సమైక్యల ద్వారా నిర్వహించడానికి పీడీ డీఆర్డీఏతో సమన్వయం చేసుకోవాలన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ గోడౌన్లకు ప్రపంచంలోనే అతి పెద్ద ధాన్యం నిల్వ ప్రణాళికా ప్రాజెక్టు క్రింద ఏమైనా కవర్ చేయడానికి అవకాశం వున్నదో లేదో చూడాలని జిల్లా సహకార సంస్థ అధికారికి జేసీ భార్గవ్ తేజ సూచించారు. జిల్లాలో పీఏసీలు నాబార్డు రుణం ద్వారా అందించిన ఆర్థిక సహాయంతో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్లలో స్థానిక రైతులు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకునేలా వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఫార్మర్ ప్రొడ్యూసింగ్ ఆర్గనైజేషన్ గుంటూరు జిల్లాకు ఒకటి కేటాయించినట్లుగా నాబార్డ్ డీడీఎం సంయుక్త కలెక్టర్‌కు తెలియజేశారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా అందించిన రుణాలను, ఓవర్ డ్యూస్‌కు యాక్షన్ ప్లాన్ రూపొందించుకొని రికవరీలు చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ వివిధ మండలాల్లో మహిళా పాడి సహకార సంఘం ఏర్పాటు కోసం 15 గ్రామాలను గుర్తించిందని , జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో 101 ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు పనిచేస్తున్నాయని సంయుక్త కలెక్టర్‌కు పశు సంవర్ధక శాఖ జేడీ నరసింహారావు తెలియజేశారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, జిల్లా పంచాయతీ అధికారి నాగసాయి కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, జీడీసీసీ బ్యాంకు సీఈఓ కృష్ణవేణి, పీడీ డీఆర్డీఏ విజయలక్ష్మి, నాబార్డు డీడీఎం శరత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణనగర్‌లో సమస్యలను తక్షణం పరిష్కరించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల అన్నపూర్ణనగర్‌లో తీవ్రంగా ఉన్న పారిశుధ్య, డ్రైనేజి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. కమిషనర్ మంగళవారం అన్నపూర్ణ నగర్, నగరాలు, గోరంట్ల, ఎస్వీఎన్ కాలనీ, వైష్ణవి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ అన్నపూర్ణనగర్ ప్రాంతంలో డ్రైనేజి సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణం మురుగునీటిని బెయిల్ అవుట్ చేయాలని ఏఈని ఆదేశించారు. చిల్లీస్ జంక్షన్ వైపు నుంచి రైల్వే గేటు వైపు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేయాల్సి ఉన్నందున అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

ఎస్వీఎన్ కాలనీలో పలు బహుళ అంతస్తు భవనాల ర్యాంప్‌లు రోడ్ల మీదకు నిర్మాణం చేయడం గమనించి ట్రాఫిక్‌కి అవరోధంగా ఉన్నందున వాటిని తొలగించాలన్నారు. సదరు ప్రాంతంలో రోడ్డు మీద ఉన్న చెట్టును నరికిసున్న ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసి, ప్రస్తుతం కాలంలో చెట్లు చాలా అవసరమని, చెట్లను నరికించడం చట్టరీత్యా నేరమన్నారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏసీపీలు రెహ్మాన్, మల్లిఖార్జున, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈ చైతన్య, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు. అన్న క్యాంటీన్లలో రూ.5కే నాణ్యమైన ఆహారం లభిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. అమరావతి రోడ్డులోని అన్న క్యాంటీన్‌ని మంగళవారం పరిశీలించి ప్రజలతో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

పన్ను బకాయిలు ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ

గుంటూరు నగరపాలక సంస్థకు ఆస్తి, ఖాళీ స్థల పన్నుల బకాయిలు ఈ నెలాఖరులోపు ఏకమొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను వడ్డీతో చెల్లించిన వారందరికీ కూడా వర్తిస్తుందని, సదరు వడ్డీలో 50 శాతం రాబోవు ఆర్థిక సంవత్సరానికి పన్నులకు జమ కాబడుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ సదవకాశాన్ని నగర పరిధిలోని పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెలలో ఉగాది, రంజాన్ పండుగ, సెలవు రోజుల్లోనూ జీఎంసీ మెయిన్, సర్కిల్ కార్యాలయాల్లో క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని తెలిపారు.

ఏప్రిల్ 1 నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలును పక్కాగా అమలు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుపై ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ సభ్యులతో, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారస్తులతో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సింగల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, కమర్షియల్ సంస్థలలో పార్కింగ్ ఫీజుల వసూళ్ళపై రాష్ట్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. నగరంలోని సినిమా హాల్స్, కమర్షియల్ కాంప్లెక్స్‌లలో పార్కింగ్ చేసిన 30 నిమిషాల లోపు పార్కింగ్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, 30 నిమిషాల నుంచి గంటలోపు ఏదైనా వస్తువు కొనుగోలు చేసిన బిల్లు ఉంటే ఫీజు అవసరం లేదన్నారు. సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, సీఎంహెచ్‌ఓ డాక్టర్ అమృతం, సీపీ రాంబాబు, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, పీవో రామారావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ మెంబర్స్, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు పాల్గొన్నారు.



కొత్తపేట సిఐ వీరయ్యకు సీసీ కెమెరాలు అందజేస్తున్న జూపూడి రంగరాజు తదితరులు

కొత్తపేట పీఎస్‌కు సీసీ కెమెరాలు పంపిణీ

గుంటూరు (విద్య) మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు నియంత్రణ కోసం తమవంతు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు వెల్లడించారు. అమరావతి రోడ్‌లోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం సీసీ కెమెరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు జూపూడి రంగరాజు, డాక్టర్ మధుసూదన్‌రావు, ప్రిన్సిపాల్ నాగభూషణ్, వైస్ ప్రిన్సిపాల్ సీతారామయ్య, కొత్తపేట సీఐ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్‌లో గల రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 55 సంవత్సరాల వయసు కలిగిన మహిళ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంపై పడి ఉండగా రైల్వే సిబ్బంది గుర్తించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతురాలిని గుర్తించిన వారు సీఐ అంజిబాబును 94406 27546లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వేసవిలో కార్మికులు జాగ్రత్తలు పాటించాలి



ఎస్.శ్రీనివాస్ కుమార్

గుంటూరు(తూర్పు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ సూచించారు. దుకాణాలు, కర్మాగారాల్లో పని చేసే కార్మికులకు ఆయా యాజమాన్యాలు తగు సౌకర్యాలను కల్పించాలన్నారు. పని ప్రదేశాలలో చల్లని నీరు, నీడ, వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, ఐవి ఫ్లూయిడ్స్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పనిచేసే సమయంలో భవన నిర్మాణ కార్మికులు శిరస్త్రాణం ధరించాలన్నారు. కార్మికుల పనివేళ సమయాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు మినహాయింపు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అధికారులు చేసే ప్రదేశాలలో పర్యటించి డీహైడ్రేషన్ ఇతర జాగ్రత్తలపై కార్మికులకు సూచనలు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఏవైన సమస్యలు ఉంటే 94925 55164 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

మహాభారతం అరణ్య పర్వంపై ప్రవచనం

గుంటూరు(తూర్పు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం మహాభారతం అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి ప్రవచిస్తూ అర్జునుడు పాశుపతాస్త్రాన్ని పొందిన విధానం, ఆ తరువాత స్వర్గానికి వెళ్ళి తన తండ్రి ఇంద్రుని కలిసినప్పటి విశేషాలను వివరించారు.

క్రైం కార్నర్

పెయింటర్ అనుమానాస్పద మృతి

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవి తక్కెళ్ళపాడు రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెంబర్ 17 లో షేక్ తంగెళ్ల (46) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తంగేళ్ల, ఖాసింబి దంపతులకు ఇరువురు కుమార్తెలు. పెద్ద కుమార్తె వివాహం చేసుకొని భార్యాపిల్లలతో శ్యామలనగర్ లో ఉంటుంది. రెండో కుమార్తెకు వివాహం జరగ్గా భార్యాభర్తల మనస్పర్ధలు వచ్చి విడిపోయారు. దీంతో చిన్న కుమార్తె రాజీవ్‌గృహకల్పలోని 31వ బ్లాక్‌లో తన కూతురితో కలిసి జీవనం సాగిస్తోంది. తంగెళ్ల మద్యానికి బానిసై అనారోగ్య కారణాలుగా కొన్ని సంవత్సరాలుగా పనికి వెళ్లడం లేదు. ఈ క్రమంలో భార్య ఖాసింబి కూలి పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తుంది. దీనిలో భాగంగా రెండు, మూడు రోజులు చిన్న కుమార్తె వద్ద ఉంటుంది. అదేవిధంగా ఈనెల 22న సాయంత్రం ఏడు గంటల సమయంలో ఖాసింబి చిన్న కుమార్తె ఇంటి వద్ద ఉండగా భర్త తంగెళ్ళ కూడా అక్కడికి వెళ్ళాడు. తాను ఇంటికి పోతున్నాను అని చెప్పి బయలుదేరి వచ్చాడు. ఆ తర్వాత నుంచి భర్త కనిపించకపోవడంతో మంగళవారం భార్య ఖాసింబీ చిన్న కుమార్తెను ఇంటికి పంపగా ఆమె వచ్చి కిటికీలోంచి చూడగా మంచం పక్కన తంగెళ్ల పడి ఉన్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో లోనికి వెళ్లి చూడగా అప్పటికే తంగెళ్ళ మృతి చెంది ఉన్నాడు. మంచం మీద నుంచి పడి అనారోగ్యంతో మృతి చెందాడా లేదంటే మద్యం సేవించి గొంతు ఎండిపోవడం వల్ల మృతి చెందాడా అనేది తెలియ రాలేదు. భార్య ఖాసింబీ ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మిర్చి కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం

తమ నుంచి మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి తనకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని ఎన్జీవో కాలనీ ఆరో లైన్‌కి చెందిన తేజశ్రీ ట్రేడర్స్ నిర్వాహకుడు పాలపర్తి శ్రీనివాస్ రెడ్డి నల్లపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ శ్రీనివాస ట్రేడర్స్ నిర్వాహకుడు శ్రీనివాసులు తన వద్ద 38 లక్షల 97 వేల 804 రూపాయల ఖరీదైన మిర్చి కొనుగోలు చేశాడన్నారు. డబ్బులు అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడన్నారు. వారం రోజుల నుంచి సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని అదృశ్యమయ్యాడన్నారు. బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాలు చోరీ

స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణ నగర్ ఒకటవ లైన్ లో షణ్ముఖ అనంత సాయి అనే వ్యక్తి ఇంటిలో చోరీ జరిగింది. ఈనెల 22న సాయంత్రం వారింట్లో శుభకార్యం జరిగింది. సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలను మంచంపై పెట్టి మర్చిపోయారు. ఆ తర్వాత వారు బయటకు వెళ్లి వచ్చిన తర్వాత చూసుకోగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. పని మనిషి మీద అనుమానం ఉన్నట్లు వారు మంగళవారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నడకదారి వివాదంలో గోడ కూల్చివేత

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్‌కి చెందిన తెనాలి రాజశేఖర్, పక్కింటికి చెందిన గణపతి రజని అనే వారికి నరక దారి విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 18న ఉదయం గణపతి రజిని, డానియల్, మరో ఇద్దరు కలసి గోడను కూల్చివేసి తమను చంపుతామని బెదిరించినట్లు బాధితుడు తెనాలి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మీతోనే నేను కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

సచివాలయ ఉద్యోగులకు పాత వాసనలు పోలేదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొంతమంది సచివాలయ ఉద్యోగులకు గత ప్రభుత్వం తాలూకు వాసనలు ఇంకా పోలేదని ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు 36వ డివిజన్ భాగ్యనగర్, సాయినగర్‌లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి 'మీతోనే నేను- మీవెంటే నేను' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివారు కాలనీలు అనేక సమస్యలతో సతమతం అవుతున్నాయని, ఆ కాలనీలో ప్రజలు రోడ్లు, డ్రెయిన్లు, వీధి దీపాలు లేక, కుక్కల బెడదతో పాటు గంజాయి బ్యాచ్ నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నట్లు తాను గమనించానని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పాటు స్థానిక సచివాలయం సిబ్బందే దీనికి ప్రధాన కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది విధులకు కూడా హాజరుకావటం లేదని, కనీసం కాలువలు కూడా తీయించటం లేదని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని, వారి తీరు మారాలని ఆమె హెచ్చరించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఈ ప్రభుత్వంలో కూడా నిర్లక్ష్యంగా ఉంటే కుదరదని హెచ్చరించారు. పంచుమర్తి వీరయ్య చౌదరి లైబ్రరీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయిందని ప్రజలు తెలపగా లైబ్రరీ పునరుద్ధరణకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండారు వెంకటేశ్వరరావు, గూడపాటి రమేష్, రోళ్ళ కోటేశ్వరరావు, సంజీవ్‌రావు, తావులాల్ నాయక్, శివజ్యోతి, జూజాల రామకృష్ణ, చేబ్రోలు రవికుమార్, రవిచంద్ర, హరిబాబు, ధూళిపాళ్ల వెంకయ్య, గుర్రం మల్లీశ్వరి, బొల్లినేని రాజారావు, గుర్రం ప్రసాద్, లంకా మాధవి, జనసేన విజయలక్ష్మి, దొండపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఇన్‌చార్జి మేయర్ సజీల

గుంటూరు కార్పొరేషన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఇన్‌చార్జి మేయర్‌గా షేక్ సజీలకి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఆమె ఏపీ సెక్రటేరియట్‌లోని ఆయన కార్యాల యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ మైనారిటీ నాయకుడు షేక్ షౌకత్, డాక్టర్ దరియా హుస్సేన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల

రాజేష్‌కుమార్‌కు తెలుగు కళా సమితి వారి ఆహ్వానం



రాజేష్ కుమార్

గుంటూరు (తూర్పు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని న్యూజెర్సీ నగరానికి చెందిన తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ వారి తెలుగు కళా సమితి నుంచి నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు, రుద్ర కళాక్షేత్రం సంస్థ ప్రచార్యులు, నాట్య విశారద మాచిరాజు రాజేష్ కుమార్‌కు అమెరికాలో ఏప్రిల్ 12న నిర్వహించే ఉగాది సంబరాల సందర్భంగా ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా నాట్యాచార్యులు రాజేష్ కుమార్ మాట్లాడుతూ న్యూజెర్సీ నగరంలో దశాబ్దాలుగా కళలు, సాహిత్య సాంస్కృతిక రంగాలలో తెలుగు వారి కోసం కృషి చేస్తున్న తెలుగు కళా సమితి ద్వారా ఆహ్వానం అందుకోవటం సంతోషంగా ఉందని చెప్పారు.



దివ్యాంగులకు.. శాశ్వత కార్డు

- యూనిఫైడ్ ఐడీ పేరుతో గుర్తింపు కార్డు అందించేలా కేంద్రం శ్రీకారం
- ఉమ్మడి జిల్లాలో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- మీ సేవ, ఇంటర్నెట్ సెంటర్‌లలో దరఖాస్తు చేసుకునే అవకాశం
- కార్డులు నేరుగా ఇంటికే పంపుతున్న ప్రభుత్వం
- యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలు కూడా సులభతరం



దివ్యాంగులకు జారీ చేస్తున్న యూనిక్ ఐడీ కార్డులు

గుంటూరు(తూర్పు), మార్చి 25(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక, అంధులకు కేంద్రం శుభవార్త చెప్పింది. శాశ్వత గుర్తింపు కార్డు జారీకి కేంద్రం శ్రీకారం చుట్టింది. గతంలో దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంద జేసే సంక్షేమ పథకాలకు సదరం సర్టిఫికెట్ తప్పనిసరి. దీనికోసం సచివాలయాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి వైకల్య శాతాన్ని నిర్ణయించి వైద్యులు సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఈ సర్టిఫికెట్‌తో బస్సు, రైల్వే పాస్‌లకు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేవారు. అంతేగాక ఉద్యోగాల ఇంటర్వ్యూల సమయంలో సర్టిఫికెట్‌తో పాటు ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి సమస్యలకు చెక్ పెడుతూ వీటి స్థానంలో మొత్తంగా కేంద్రం యూడీఐడీ(యూనిఫైడ్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు) ఒకే కార్డు తీసుకొచ్చింది. దీనికి సంబంధించిన ప్రక్రియ జిల్లాలో మొదలైంది.

దరఖాస్తు.. ఇలా చేసుకోవాలి

మీ సేవ, ఇంటర్‌నెట్, మొబైల్ ఆన్‌లైన్‌లో స్వావలంబన్‌కార్డు. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, అందులో అప్లయ్ బటన్‌పై క్లిక్ చేయాలి. వెంటనే దరఖాస్తుకు సంబంధించిన సూచనలు ఉంటాయి. సూచనలను అంగీకరిస్తూ సబ్‌మిట్ క్లిక్ చేస్తే ఫారం ఓపెన్ అవుతుంది. ఫామ్‌లో ఉన్న అంశాలను క్షుణ్ణంగా చదివి సమాచారాన్ని నింపడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అవుతుంది. కావాలంటే దరఖాస్తు స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకునే వెసులుబాటును కల్పిస్తుంది.

యూనిక్ ఐడీతోనే గుర్తింపు

భవిష్యత్తులో యూనిక్ ఐడీని తప్పనిసరి చేయాలని కేంద్రం భావిస్తున్నది. మిగిలిన రాష్ట్రాల్లో కూడా ఈ గుర్తింపుకార్డుతో ప్రయాణాల్లో రాయితీలు పొందవచ్చు. అంతేగాక రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఈ కార్డు ద్వారా అందుకోవచ్చు. ఈ కార్డులో ఆధార్, వైకల్య శాతం, ఇతర వివరాలను పొందుపరు స్తున్నారు. ఈ ఐడీని స్కాన్ చేస్తే పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు సదరం సర్టిఫికెట్లు మన రాష్ట్రంలో మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఐడీ కార్డులు మాత్రం దేశ వ్యాప్తంగా చెల్లుబాటు అవుతుంది.

2014లోనే ఈ ఆలోచనకు శ్రీకారం

వాస్తవానికి 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో ప్రత్యేక కార్డులను ప్రవేశపెట్టింది. ఈ కార్డులను జిల్లా విభిన్న ప్రతిభావంతుల కార్యాలయానికి పంపారు. అవి డీఆర్‌డీఏ శాఖకు అప్పజెప్పగా, వాటి బాధ్యత మెప్మాకు అప్పజెప్పారు. మెప్మా అధికారులు కొంతమందికి పంపిణీ చేసి, మిగిలిన వారికి ఇవ్వలేదు. కాకపోతే ఈ కార్డులో వైకల్యంశాతం మినహా మిగిలిన వివరాలను పొందు పరచకపోవడంతో ఈ కార్డులపై లబ్ధిదారులు ఆసక్తి చూపించలేదు. ప్రస్తుతం ఈ విధానాన్ని అప్‌డేట్ చేసి స్మార్ట్‌కార్డులను కేంద్రం తీసుకువచ్చింది.

సులభం...సదరం

కేంద్రం తీసుకొచ్చిన యూడీఐడీ పోర్టల్‌తో సదరం సేవలను కూడా అందజేస్తుంది. నూతనం విధానంతో సదరం సులభతరం చేసింది. ఈ పోర్టల్ ద్వారా సదరం శిబిరాలు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు సంబంధించిన వివరాలు వారి ఫోనుకు సమాచారం వస్తుంది. వైద్య పరీక్షలకు ఎక్కడికి రావాలి... ఎప్పుడు రావాలి అనే విషయాలను ఎస్ఎమ్ఎస్ ద్వారా పంపుతారు. గతంలో ఆన్‌లైన్ ద్వారా 5రకాల వైకల్యాలకు సంబంధించిన వ్యాధులకు సదరంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్‌లో 18రకాల వైకల్యాలను చేర్చారు. వాటిలో న్యూరో సంబంధిత బాధితులు, తలసీమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వ్యాధి నిర్ధారణ పూర్తయిన తరువాత కార్డుల రూపంలో నెల రోజులలోపు నేరుగా తపాలా కార్యాలయం ద్వారా ఇంటికే పంపుతున్నారు. చిరునామా సరిగ్గా లేకపోవడం, లబ్ధిదారుడు అందుబాటులో లేకపోతే ఈ కార్డులు కొన్ని చోట్ల స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేదా తపాలా కార్యాలయాల వద్ద ఉంచుతున్నారు. ఐడీ నెంబర్ చెబితే కార్డును తీసుకోవచ్చు.

కేంద్రం ఆలోచన అభినందనీయం



దివ్యాంగులు పడుతున్న కష్టాన్ని చూసి గుర్తింపు కార్డు ఇవ్వాలనే కేంద్రం ఆలోచన అభినందనీయం. గతంలో ఆయా కార్యాలయాల చుట్టూ తిరగాలంటే ఇబ్బంది పడేవాళ్లం. కేంద్రం ఆలోచనతో ఉమ్మడి జిల్లాలో ఉన్న లక్షా ఇరవై వేల మందికి లబ్ధి చేకూరుతుంది. ఇతర రాష్ట్రాల్లో కూడా చెల్లుబాటు అయ్యేలా కార్డు రూపొందించడం సంతోషంగా ఉంది. దరఖాస్తు చేసుకుని కార్డులు అందని వారు నేరుగా పోస్టల్ కార్యాలయాల్లో సంప్రదించాలి.

వై నరసింహారావు, విజువల్లీ ఛాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, జిల్లా అధ్యక్షుడు

శాశ్వత ఐడీ తప్పనిసరి



భవిష్యత్తులో యూనిక్ ఐడీ తప్పనిసరి. జిల్లాలో ఉన్న దివ్యాం గులు విధిగా దరఖాస్తు చేసుకో వాలి. కేంద్రం తీసుకువచ్చిన యూడీఐడీ పోర్టల్ ద్వారా సదరం సేవలను పొందవచ్చు.

సువార్త, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల జిల్లా శాఖ, ఏడీ

నాటి హామీ నేడు అమలు

(5వ పేజీ తరువాయి)

మున్సిపాల్టీలో అభివృద్ధిని గాలికొదిలేసిందని జీవీ ఆంజనేయులు ఆరోపించారు. నాడు టీడీపీ ప్రభుత్వం రూ.161 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టగా వైసీపీ వాటిని నిలివేసిందని విమర్శించారు. తాజాగా ఆ పతకాన్ని తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తితో పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుందన్నారు. ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. 102.60 లక్షలతో పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ద్వారా ప్రజలు వారి సమస్యలు తన దృష్టికి తీసుకురాగా వాటిఇని పరిష్కారిస్తున్నామన్నారు. ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజలు కోరిన పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3 కోట్లను విడుదల చేసిందని వాటితో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంతో ప్రజలకు ప్రజాప్రతినిధులు.. అధికారుల మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు.. ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకోవడానికి.. వాటి పరిష్కారానికి అవకాశం కలుగుతుందన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమం చేపట్టిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఛైర్మన్ వేమూరి రాధాకృష్ణకు ప్రత్యేక అభినందలు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ ఛైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, నన్నేసా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ లెనిన్‌కుమార్, నాగ శ్రీను, నిశ్శంకర శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ ఎన్నికలపై జడ్పీ సీఈవో సమీక్ష

గుంటూరు సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూ రు జిల్లా పరిధిలోని తొమ్మిది మండల పరిషత్‌ల్లో ఈ నెల 27న జరగ నున్న ప్రత్యేక ఎన్నికల కార్యక్ర మం పై జడ్పీ సీఈవో వీ జ్యోతి బసు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కో- ఆప్షన్ మెంబర్ల ఎన్నికలకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై జ్యోతి బసు ఎంపీడీవోలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన శిక్షణ కూడా ఇవ్వటం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి గురజాల డీఎల్‌డీవో గబ్రూ నాయక్, పెదకా కాని ఈవోపీఆర్‌డీ కే శ్రీనివాసరావు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి పిట్టలవానిపాలెం, భట్టి ప్రోలు, దుగ్గిరాల, గుంటూరు రూరల్, తెనాలి, అచ్చంపేట, కారంపూడి, నరస రావుపేట, ముప్పాళ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు హాజరయ్యారు.

మరో ఆర్వోబీ మంజూరు

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. అంతర్జాతీయ స్టేడియానికి వెళ్లేందుకు ఈ మార్గమే కీలకం కావడంతో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆర్వోబీ నిర్మించాలని కోరింది. ఈ నేపథ్యంలో మంగళవారం కేంద్ర రైల్వే శాఖ ఆర్వోబీ నిర్మాణానికి అంగీకరించింది. మంగళగిరి- నిడమర్రు రహదారిలో ఒక కిలోమీటరు మేర నిర్మించే ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించిన మొత్తం ఖర్చును కేంద్రమే భరించేలా రూ.129.18 కోట్లు మంజూరు చేసింది.

9 నెలలు.. ఐదు వంతెనలు

గడిచిన తొమ్మిది నెలల్లో జిల్లాకు 5 ఆర్వోబీలు మంజూరయాయి. కిందటేడాది అక్టోబరులో శంకర్ విలాస్ ఆర్వోబీకి రూ.98 కోట్లు మంజూరవగా, ఈ ఏడాది జనవరి 9న రెడ్డిపాలెం- గడ్డిపాడు ఆర్వోబీకి రూ.107.79 కోట్లు, జనవరి 28న నల్లపాడు- పెదపలకలూరు ఆర్వోబీకి రూ.41 కోట్లు, ఈనెల 8న పాత గుంటూరులోని హనుమాన్‌పాలెం వద్ద నిర్మిస్తున్న నందివెలుగు ఆర్వోబీకి రూ.36.91 కోట్లు కేంద్రం మంజూరు చేసింది. ఈ నాలుగు ఆర్వోబీలు ఒక ఎత్తయితే మంగళగిరి ఆర్వోబీకి భారీ మొత్తంలో రూ.129.18 కోట్లు మంజూరు చేస్తూ కేంద్రం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు విడుదలైనట్లు పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.

జీఎంసీకి డాక్టర్ నరేష్‌బాబు రూ.25 లక్షల విరాళం

● నూతన క్యాంటీన్ నిర్మాణం కోసం...



గుంటూరు మెడికల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో నూతనంగా చేపడుతున్న క్యాంటీన్ నిర్మాణానికి ప్రముఖ స్పైన్ సర్జన్, మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జె నరేష్‌బాబు రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. జీఎంసీ 1991వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ నరేష్ బాబు వ్యక్తిగతంగా ఈ విరాళం అందజేస్తున్నారు. ప్రస్తుతం కాలేజీ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో ఉన్న పాత క్యాంటీన్‌ను తొలగించి ఆ స్థానంలో ఎగ్జామినేషన్ హాల్‌ను నిర్మిస్తున్నారు. జింకానా ఆడిటోరియం సమీ పంలో కొత్త క్యాంటీన్‌ను నిర్మిస్తారు. ఈ క్యాంటీన్ నిర్మాణానికి రూ.40 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నరేష్‌బాబు రూ.25 లక్షలు... మిగిలిన మొత్తాన్ని నాటి తన బ్యాచ్ మేట్లను సంప్రదించి సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. నరేష్‌బాబును జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి మంగళవారం అభినందించారు.

90 శాతం టెండర్లు.. 15 రోజుల్లో పనులు

తుళ్లూరు, మంగళగిరి, గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారని వైసీపీ చేస్తున్న వాదన సరైనది కాదు. ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం పడకుండా రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. రాజధాని నిర్మాణం పూర్తయితే భూముల విలువ పెరుగుతుంది. సంపద సృష్టి జరుగుతుంది. దానితో రాజధాని కోసం చేసిన రుణాలను తీర్చవచ్చు..' అని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. రాజధాని అమరావతిలో మంగళవారం ఆయన పర్యటించారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల భవనాలు, సీఆర్డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని పరిశీలించారు. రాయపూడి రెవెన్యూలో నిర్మాణంలో ఉన్న శాఖాధిపతుల బం గ్లాలను పరిశీలించారు. అనంతరం సీఆర్డీఏ జోనల్ కార్యాలయాన్ని సందర్శించారు. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని కెసీపీ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పనులలో జాప్యం జరిగితే సహించేది లేదని మంత్రి వారికి సూచించారు. ఏప్రిల్ 20కి ఆరు అంతస్థులకు నాలుగు అంతస్థులు పూర్తి చేసి అప్పచెపతామన్నా రు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పునర్నిర్మాణ పనులకు సంబంధించి 90 శాతం టెండర్లు పూర్తయ్యాయని తెలిపారు. క్లీనింగ్‌తో మొదలైన పనులు మరో 15 రోజుల్లో కాంట్రాక్టర్లకు మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని, ఆ తర్వాత పూర్తిస్థాయిలో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. కార్యదర్శి, ప్రధాన కార్యదర్శుల భవనాలు పరిశీలిం చామని, 186 భవ నాలు మంత్రులు, హైకోర్టు జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు అందుబాటులోకి తెస్తామ న్నారు. వాటితోపాటు గెజిటెడ్ అధికారులకు 1440, ఎన్జీవోలకు 1,995 ప్లాట్ల నిర్మాణాలు పూర్తవగా, 16.85 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైకోర్టు భవనం, 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా అసెంబ్లీ భవనం వస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు అమరావతిని పాడుపెట్టడంతో పాటు రాజధాని పనులను సమస్య జఠిలం చేసిందని మంత్రి తెలిపారు. నిర్మాణ సం స్థలకు బిల్లులు ఇవ్వకుండా తరిమేసిందని, వాటిని క్లియర్ చేసి నూతనంగా పనులకు టెండర్లు కేటాయిస్తున్నా మన్నారు. మాస్టర్ ప్లాన్ ప్ర కారం పనులు పూర్తి చేస్తామన్నారు. లండన్‌కు చెందిన నార్మన్ ఫాస్టర్ కంపెనీ ఐకానిక్ టవర్ల డిజైన్ తయారు చేసినట్లు చెప్పారు.

రంగంలోకి కాంట్రాక్టు సంస్థలు.. చురుగ్గా పనులు

అమరావతి నిర్మాణ పనులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రభుత్వ భవనాలను ఏడాదిలోగా పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలకు ముందస్తుగానే డెడ్‌లైన్‌ను విధించింది. నిర్ణీతగడువులోగా నిర్మాణ పనులను పూర్తిచేసి అప్పగించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో కాంట్రాక్టు ఏజెన్సీలు పనులకు సంబంధించి ఉత్తర్వులను అందుకుందే ఆలస్యంగా క్షేత్రస్థాయిలోకి దిగిపనులను ముమ్మరంగా జరిపిస్తున్నాయి. ఈ క్రమంలో మంత్రులు, జడ్జీల తాలూకు బంగ్లాలతోపాటు, ఏఐఎస్, ప్రిన్సిపల్ కార్యదర్శుల బంగ్లాలను త్వరిత గతిన పూర్తిచేసే లక్ష్యంతో కాంట్రాక్టు ఏజెన్సీలు తమతమ యంత్రాంగాన్ని రంగంలోకి దించాయి. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం దాదాపు ప్రారంభ దశకు చేరుకుంటుండగా, సెంట్రల్ ఫొరెన్సిక్ సైన్సెస్ లాబొరేటరీ భవనసముదాయం పనులు చాలా వరకు పూర్తయ్యాయి. 2019 నాటికి మొదలుపెట్టి చాలావరకు పూర్తయిన ప్రభుత్వ క్వార్టర్స్ పనుల పూర్తికి కాంట్రాక్టు సంస్థలు రంగంలోకి దిగాయి. ఏఐఎస్ కార్యదర్శుల బంగ్లాలకు రూ.411.37 కోట్లు, మంత్రులు, న్యాయమూర్తుల విల్లాలకు రూ.401.37 కోట్లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్లకు రూ.300 కోట్ల వంతున ఖర్చు చేస్తున్నారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాల పనుల పరిశీలనలో మంత్రి నారాయణ



కార్యదర్శుల భవనాల వద్ద మంత్రి నారాయణ

- ఇతర రాష్ట్రాల నుంచి వలస వస్తున్న కూలీలు
- కూలీల కోసం ఏర్పాటవుతున్న తాత్కాలిక షెడ్లు
- భారీగా వస్తున్న యంత్రసామగ్రి

కళకళలాడుతున్న అమరావతి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని అమరావతి ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉండేది. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ ఈ ప్రాంతంలో ఆశలు చిగురించాయి. దానికి ఊతమిస్తూ, అరణ్యంలా మారిన అమరావతిలో వందలకొద్దీ ఎక్స్‌కవేటర్లతో చెట్లు, కంప తొలగింపు పనులను చాలా వరకు ప్రభుత్వం జరిపించింది. అయితే వెనువెంటనే రాజధాని నిర్మాణ పనులను మొదలుపెట్టడానికి ఎన్నో సమస్యలు, న్యాయపరమైన చిక్కుముడులు అడ్డొచ్చాయి. వాటన్నింటిని క్రమంగా ఛేదించుకుంటూ నిధులను సమకూర్చుకుంటూ... నేడు ఏకంగా రమారమి రూ. 50 వేల కోట్ల విలువైన నిర్మాణ పనులను మూకుమ్మడిగా చేపట్టి రాజధాని ప్రాంత వాసులను ఆనందడోలికల్లో ముంచెత్తుతున్నది. దీంతో, అమరావతి పాత, కొత్త వీధులు మళ్లీ జనసామర్థ్యంతో కిక్కిరిస్తున్నాయి. కొత్తకొత్త హోటళ్లు, టీ కొట్లు, బడ్డీ కొట్లు ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. రాజధాని నిర్మాణ పనుల్లో పాలుపంచుకునేందుకు వస్తున్న భారీ యంత్రసామగ్రితో అమరావతి హోరెత్తుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న కూలీలతో అమరావతి మళ్లీ కళకళలాడుతోంది.

రాజధాని అమరావతిలో నిర్మాణపనులు చేయడానికి టెండర్లను దక్కించుకున్న బడా కాంట్రాక్టు సంస్థలు అప్పుడే కార్యరంగంలోకి దిగిపోయాయి. తామే ఏయే ప్రాజెక్టులను చేపట్టబోతున్నామో ఆయా ప్రాంతాల్లో ఆయా నిర్మాణాలకు సంబంధించిన భారీ యంత్ర పరికరాలను చేరవేసుకుంటున్నారు. ఇవన్నీ హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి దూరప్రాంతాల నుంచి ఇక్కడికి తరలివస్తున్నాయి. ఈ యంత్ర సామగ్రితో పాటుగా కూలీ పనులను చేసేందుకు ప్రతీ కాంట్రాక్టు సంస్థ ఒరిస్సా, బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాదిమందిని అమరావతికి రప్పిస్తున్నారు. వీరందరికీ పనిచేయాల్సిన ప్రాంతాలలో భారీ షెడ్లను ఏర్పాటుచేసి వారికి తాగునీరు, టాయ్‌లెట్లు వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాకుండా ఎక్కడికక్కడ రెడీమిక్స్ ప్లాంట్లు కూడా పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి.

ఇదిలావుండగా రాజధాని అమరావతిలో ఏప్రిల్ మూడవ వారంలో జరుగనున్న ప్రధాని మోదీ సభకోసం వచ్చే అతిథులను ఆకట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీడ్ యాక్సిస్‌తో పాటు ఇతర ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటించే కార్యక్రమాన్ని చేపట్టింది.



అమరావతి ప్రధాన వీధుల వెంబడి మొక్కలను నాటుతున్న దృశ్యం



యంత్రాల సాయంతో అగ్రరలోకి ఐరన్ బుట్టలను దించుతున్న దృశ్యం



అమరావతిలో కూలీల కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న షెడ్లు

మిర్చి రైతుల నిరసన

ధర తగ్గించడంతో రోడ్డెక్కిన రైతులు

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు వివిధ ప్రాంతాల నుంచి ఎండుమిరపకాయలు అమ్ముకోనేందుకు వస్తున్న రైతులకు ఇక్కడి వ్యాపారస్థులు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నారు. నాణ్యత సరిగా లేదని చెబుతూ ధర గణనీయంగా తగ్గిస్తున్నారు. ఇష్టమైతే అమ్మండి లేకుంటే మీ సరుకు తీసుకెళ్లండంటూ మొండిగా వ్యవహరిస్తున్నారు. దీంతో కడుపు కాలిన మిర్చి రైతులు మంగళవారం మిర్చి యార్డు గేట్లకు తాళం వేసి నల్లపాడు రోడ్డులో జాతీయ రహదారిపై నాలుగు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. తమకు గిట్టుబాటు ధర కావాలని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెబితేనే ఆందోళన విరమిస్తామని అక్కడికి వచ్చిన పోలీసు అధికారులకు తేల్చి చెప్పారు. రైతుల ఆందోళన సున్నితమైనది కావడంతో పోలీసులు సంయమనం పాటించారు. వాహనదారులు, బస్సుల్లో ఉన్న ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని, ఆందోళన విరమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. చివరికి మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జ్, జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ, ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక వచ్చి చర్చలు జరిపి తాము ప్రభుత్వానికి నివేదించి కనీస మద్దతు ధర వచ్చేలా ప్రయత్నిస్తామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపచేశారు. రైతులు తమ ఆధార్, ఈ-క్రాప్ బుకింగ్, బ్యాంకు అకౌంట్ వివరాలను యార్డు పరిపాలన భవనంలో సమర్పించాలని కోరారు. రైతులు కోరిన విధంగా మిర్చి ధరలు ఎప్పటికప్పుడు తెలిసేలా ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మిర్చి రైతులు సుమారు నాలుగు గంటల పాటు రాస్తారోకో చేయడం వలన నల్లపాడు రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మరోవైపు పోలీసులు చుట్టుగుంట వద్దనే ట్రాఫిక్‌ని మళ్లించారు. అలానే హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న వాహనాలను నల్లపాడు వద్ద ఇన్నర్ రింగు రోడ్డులో నుంచి చిలకలూరిపేట హైవే వైపు మళ్లించారు.

రైతుల ఆందోళన వెనక వైసీపీ పాత్రపై అనుమానాలు

మిర్చి రైతులు హఠాత్తుగా ఆందోళనకు దిగడం వెనక వైసీపీ సానుకూల వ్యాపారస్థులు ఉన్నట్లు మార్కెటింగ్ అధికారులు అనుమానిస్తున్నారు. గత ఏడాది మిర్చి యార్డులో ఒక ట్రేడర్ పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన రైతుల మిర్చిని అమ్మేసి దాదాపుగా రూ. 50 లక్షలు బకాయి పడ్డాడు. అయితే అతను ఆ నగదు చెల్లించకపో తుండటంతో రైతులు ఇటీవలే ధర్నా కూడా చేశారు. అలానే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఇతర నాయకులను కలిసి తమ సమస్యని నివేదించారు. దీనిపై మార్కెటింగ్ శాఖ స్పందించి ఎవరైతే రైతులను మోసం చేశాడో ఆ వ్యాపారి లైసెన్సుని ఇటీవలే సస్పెన్షన్ చేశారు. అయిన ప్పటికీ అతను యార్డులో మరో ముగ్గురు వ్యాపారస్థులతో చేతులు కలిపి తన వ్యాపారానికి అడ్డం లేకుండా వారి ముసుగులో ట్రేడింగ్ చేస్తున్నాడు. దీనిపై రైతులు ఫిర్యాదు చేయడంతో సోమవారం ఆ ముగ్గురు వ్యాపారస్థులకు కూడా నోటీసులు, షోకాజ్‌లు జారీ చేసి లైసెన్సులను నిలుపుదల చేశారు. ఈ పరిణామం జరిగిన కొద్ది గంటల్లోనే రైతులు రోడ్డెక్కడం వెనక కచ్చితంగా వాళ్లే రైతులను రెచ్చగొట్టారని అధికారులు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాస్తారోకో ప్రారంభం సమయంలో వైసీపీ మద్దతుదారులు రైతులతో పాటు వుండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.



నల్లపాడు రోడ్డులో స్తంభించిపోయిన వాహనాలు

487 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 487 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11.100, మోడల్‌ధర రూ.11,001 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠధర రూ.11,100 మోడల్‌ధర రూ. 11,001 పలికాయి.

మేడికొండూరులో రేపు రుణ మేళా

మేడికొండూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందగోరేవారు ఈనెల 27వ తేదీన మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే రుణ మేళాకు హాజరు కావలసిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో పాటిబండ్ల పూర్ణశంకరరావు మంగళవారం తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా కమ్మ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కాపు, మేదర, శాలివాహన కార్పొరేషన్లకు సంబంధించి రుణమేళా 10 గంటలకు జరుగుతుందన్నారు. ఈ రుణమేళాకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే హాజరుకావలసి ఉంటుంది. రుణమేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ చేసినట్టుగా అందిన పత్రంతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి సంబంధిత బ్యాంక్ మేనేజర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను ముఖాముఖి పరీక్ష చేసి అర్హులైన వారిని ఎంపిక చేస్తామని ఆయన వివరించారు.

రేపు భవానా రుషి స్వామి కల్యాణం

తుళ్లూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం భద్రావతి సమేత భావనారుషి స్వామి 14వ వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు సంఘం అధ్యక్షుడు బి.వెంకయ్య సంఘం సమావేశంలో మంగళవారం తెలిపారు. తుళ్లూరు పద్మశాలీ పేటలో ప్రతి సంవత్సరం మాదిరిగానే వైభవంగా స్వామి కల్యాణం జరుగుతుందని వెల్లడించారు. కల్యాణం అనంతరం కల్యాణ మూర్తులకు గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలును స్వీకరించి స్వామి వారి ఆశీర్వాదం పొందాలని కోరారు. సమావేశంలలో కమిటీ కార్యదర్శి సురేష్, కోశాధికారి శివకృష్ణ, నరసింహారావు నాగార్జున, అరవింద్, తదితురులు పాల్గొన్నారు.


దాడి చేసి కారుతో పరారీ

మంగళగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి కారుతో పరారైనట్టు బాధితుడు మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం తిరువల్లు జిల్లా పెరుమాల్ పట్టి ప్రాంతానికి చెందిన సింథిల్‌కుమార్ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేస్తుంటారు. సింథిల్‌కుమార్ బెంగళూరులో నివాసం ఉంటున్న హరీష్ అనే వ్యక్తికి రూ.4 లక్షల నగదు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన సింథిల్ కుమార్ విజయవాడ ఆటోనగర్‌కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న హరీష్ విజయవాడ చేరుకుని మణికంఠ, మరో వ్యక్తితో కలిసి సింథిల్‌కుమార్‌ను అనుసరించారు. ఈ నెల 18వ తేదీన మంగళగిరి ఎన్నారై ఆస్పత్రి సమీపంలో సింథిల్‌కుమార్ కారు ఆపి దిగగా హరీష్, మణికంఠ, మరో వ్యక్తిపై తనపై దాడి చేశారని తెలిపారు. కారు అద్దాలను పగలగొట్టి టీఎన్06ఎల్2288 కారును లాక్కుని వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కారులో రూ.లక్ష నగదు, ఏటీఎం కార్డు, ఇతర విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయని, తనపై దాడి చేసి కారును లాక్కుని వెళ్లిన హరీష్, మణికంఠ, మరో వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

హిజ్రాలకు పోలీసుల కౌన్సెలింగ్

మంగళగిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రత్నాలచెరువు వద్ద పలువురు హిజ్రాలకు పట్టణ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. పట్టణ సీఐ డి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ రోడ్లపై తిరిగే జనాన్ని ఆపి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తే ఉపేక్షించేది లేదని, బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దని సూచించారు. శుభకార్యాలు, దుకాణాల ప్రారంభోత్సవాలకు వద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేయవద్దని, ఇష్టపూర్వకంగా ఇస్తే తీసుకోవాలని తెలియజేశారు. ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

వృథాగా తాగు నీరు..



చెక్‌పోస్టు వద్ద పంచాయతీ వాటర్ పైప్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

పెదనందిపాడు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న తరుణంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి పొదుపుగా వాడుకోవాల్సి ఉండగా అధికారుల నిర్లక్ష్యంతో పెదనందిపాడులో తాగునీరు ఇలా వృథాగా పోతున్నాయి. కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నప్పటికీ పంచాయతీ సిబ్బంది చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్థానిక వ్యవసాయ చెక్‌పోస్ట్ వద్ద పంచాయతీ వాటర్ పైప్‌లైన్ లీకై నీరు వృథాగా పోతుందని, దీంతో ఆ ప్రాంతానికి నీరు కలుషితమై దుర్వాసనతో వస్తున్నాయని ప్రాంత ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రాంత వాసులు కోరుతున్నారు.

రైలు పట్టాలపై మహిళ మృతదేహం

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్‌లో గల రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సుమారు 55 సంవత్సరాల వయసు కలిగిన మహిళ రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబర్ ప్లాట్ ఫారంపై పడి ఉండగా రైల్వే సిబ్బంది గుర్తించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

స్త్రీనిధి రుణాల అవకతవకలపై విచారణ పూర్తి

● గ్రూపులన్నింటికి ఒకే ఖాతా..
● చెల్లింపుల్లో గందరగోళం

మేడికొండూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలు తిరిగి చెల్లింపు వ్యవహారంలో అవకతవకలు జరిగాయని మేడికొండూరు గ్రామానికి చెందిన కార్తికేయ మహిళా గ్రూప్ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం స్త్రీనిధి మేనేజర్ రాజ్‌కుమార్ విచారణ జరిపారు. గ్రూపులన్నీ కలిపి ఒకే ఖాతాకు చెల్లింపులు చేయడంతో గందరగోళం జరిగినట్టు చెబుతున్నారు. తాము తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించినా ఇంకా బకాయిలున్నట్టు చూపి అదనంగా 31వేల 5వందల రూపాయలు వసూలు చేశారని కార్తికేయ మహిళా గ్రూప్ సభ్యులు గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించారు. దీంతో విచారణ చేపట్టిన స్త్రీనిధి మేనేజర్ రాజ్‌కుమార్ గ్రూపు సభ్యులు తీసుకున్న రుణం, తిరిగి చెల్లించిన వివరాలను పరిశీలించారు. విచారణలో గ్రూప్ సభ్యులు తమ రసీదులను రాజ్‌కుమార్ ముందు ఉంచారు. అనంతరం వెలుగు కార్యాలయంలోని ఖాతాను పరిశీలించి 18నెలల క్రితం గ్రూపు సభ్యులు చెల్లించిన వాయిదా మొత్తం 17వేల 5 వందలు స్త్రీనిధి ఖాతాకు జమకాలేదని తేల్చారు. గ్రూపు యానిమేటర్ వివరాలను సక్రమంగా రికార్డుల్లో నమోదు చేయకపోవడమే కారణమని పరిశీలించి తగు న్యాయం చేస్తానని రాజ్‌కుమార్ గ్రూపు సభ్యులకు వివరించారు. అంతేకాకుండా మొత్తం 31వేల 5వందల రూపాయలు అదనంగా చెల్లించినట్టు సభ్యుల వద్ద ఆధారాలు ఉన్నట్టు తేల్చారు. తాము తీసుకున్న రుణానికి మించి ఎందుకు వసూలు చేయాల్సి వచ్చిందో తమకు వివరణ ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. తాము రుణం పొందిన తరువాత 20వాయిదాలలో సక్రమంగా చెల్లిస్తున్నామని, అయినప్పటికి తమ కంప్యూటర్‌లో ఇంకా చెల్లించాలని చూపుతుందని వెలుగు కార్యాలయంలో సీసీ మహిళలకు సరైన వివరాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గ్రామంలోని అన్ని గ్రూపులకు కలిపి ఒకే ఖాతా ఉండడంతో ఎవరెవరూ ఎంత చెల్లింపులు చేసింది యానిమేటర్‌కు సభ్యులు వివరాలు అందజేయాలని, ఆ వివరాలు సభ్యులు ఇవ్వకపోయినా, యానిమేటర్ సకాలంలో రికార్డులలో నమోదు చేయకపోయినా గ్రూపు సభ్యులు నష్టపోవాల్సి వస్తుందని, దీనిని పరిశీలించాల్సిన యానిమేటర్ల నిర్లక్ష్యం కారణంగా గ్రూపు సభ్యులు నష్టపోతున్నారని విచారణకు హాజరైన సభ్యులు తెలిపారు. యానిమేటర్లకు కూడా విచారించి పూర్తి వివరాలు పరిశీలించి న్యాయం చేస్తామని రాజ్‌కుమార్ వివరించారు.

వేసవి సెలవుల్లో క్లాసుల పేరిట విద్యార్థులపై ఒత్తిడి



ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భారతికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

మంగళగిరిసిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులపై మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ అన్నారు. వేసవిలో క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఏపీ ఇంటర్మీడియెట్ బోర్డు జాయింట్ సెక్రెటరీ భారతికి ఏఐఎస్ఎఫ్ నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ ఇంటర్మీడియేట్ జూనియర్ కళాశాలలు బ్రిడ్జి కోర్సు పేరిట వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి పది రోజులు కూడా పూర్తవకముందే ద్వితీయ సంవత్సరం సిలబస్ మొదలుపెట్టి తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ కనీసం ఆ కళాశాలల వైపు కన్నెత్తి చూడడంలేదని వాపోయారు. ఐఐటీ, జేఈఈ మెయిన్స్, నీట్ పేరుతో లక్షలాది రూపాయలను తల్లిదండ్రుల నుంచి దండుకుంటున్నారని ఆరోపించారు. ఇలా మానసిక ఒత్తిడికి గురిచేయడం వల్లనే విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఉమాకాంత్, లీలాకృష్ణ, గోపి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు సాంకేతిక అంశాలపై దృష్టి అవసరం

● వాల్‌మార్ట్(యూఎస్ఏ) సాఫ్ట్‌వేర్ మేనేజర్ వాసుదేవ



వాల్‌మార్ట్ సాఫ్ట్‌వేర్ మేనేజర్ వాసుదేవను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం, డీన్ రమేష్‌బాబు, విద్యార్థినులు

వట్టిచెరుకూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థిని సాఫ్ట్‌వేర్ రంగంతో పాటు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్సీ మిషన్ సాంకేతిక అంశాలపై ప్రత్యేక దృష్టి అవసరమని వాల్‌మార్ట్ (యూఎస్ఏ) సాఫ్ట్‌వేర్ మేనేజర్ ఎం వాసుదేవ అన్నారు. మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సీఎస్ఈ తృతీయ సంవత్సరం విద్యార్థినులకు ఇంజనీరింగ్‌లో గ్రౌండింగ్, పరిశ్రమలు ప్రతిపాదించిన ఉత్తమ పద్ధతులు అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వాసుదేవ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రస్తుత పరిస్థితులు, ఇతర అంశాలపై ప్రత్యేక ప్రాధాన్యతలు ఎలా ఉండాలనే అంశాలను ఆయన వివరించారు. మలినేని విద్యాసంస్థల డీన్ అడ్మినిస్ట్రేషన్ వీ రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని వ్యక్తిగత క్రమశిక్షణతో విద్యపై దృష్టి పెట్టాలన్నారు. సెమినార్‌లో విద్యాసంస్థల చైర్మన్ మలినేని పెరుమాళ్ళు, కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, సీఎస్ఈ హెడ్ జీ రామస్వామి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వకుంటే ఉద్యమం ఉధృతం



ధర్నాలో ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా నేత రామారావు

మంగళగిరిసిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో వివిధ రకాల భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, లేని పక్షంలో ప్రజలందరినీ సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన ప్రజా చైతన్యయాత్రల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎంటీఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో రామారావు మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా అనేక పేదల కాలనీలు ఏర్పడ్డాయన్నారు. వారిలో 20 వేల మందికి పైగా పట్టాలు ఇప్పించామని చెప్పారు. మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు తనను గెలిపిస్తే నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఇళ్లు వేసుకుని ఉంటున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నేత ఈమని అప్పారావు మంగళగిరి టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారులకు బ్యాంకు రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఎం నేతలు ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పీ బాలకృష్ణ, ఎం పకీరయ్య, యూ దుర్గారావు, కమలాకర్, బ్రాహ్మణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను మంత్రి లోకేశ్ పరిష్కరించాలి

● సీపీఎం నేత పీ మధు



చిర్రావూరులో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నేత మధు

తాడేపల్లి (చిర్రావూరు), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి లోకేశ్ చొరవ తీసుకుని పరిష్కరించా లని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి మధు అన్నారు. మంగళవారం సాయంత్రం చిర్రావూరులో రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్య ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటీఎంసీ విలీన గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందన్నారు. ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వ్యర్థాలతో నిండిపోవడం వల్ల పంట కాలువ కింద సాగయ్యే చిర్రావూరు భూములన్నీ చౌడు భూములుగా మారాయన్నారు. తక్షణ మే గ్రామంలో డ్రైయినేజి వ్యవస్థ ఏ ర్పాటు చేసి మురుగు సమస్య పరిష్క రించేందుకు మంత్రి లోకేశ్ చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీఐటీయూ జిల్లా నాయకులు వై నేతాజి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు, దొం తిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, బూరగ వెంకటేశ్వర రావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజు కొనసాగిన పర్యటన

తాడేపల్లి టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మురుగు సమస్యతో తాడేపల్లి వాసులు అల్లాడుతున్నారని మాజీ ఎంపీ, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి మధు అన్నారు. మంగళవారం తాడేపల్లి బైపాస్ రోడ్ పెట్రోల్ బంక్ నుండి బకింగ్ హామ్ కెనాల్ వరకు అపార్టుమెంటు వాసులతో కలిసి ఆయన పర్యటించారు. మురుగుసమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని మధు హెచ్చరించారు. మంచి నీటి ట్యాపుల ద్వారా వస్తున్న నీరు మురుగునీటితో కలిసి వస్తుందని తాగలేకపోతున్నట్టు ప్రజలు చెప్పినట్టు తెలిపారు. దుర్గా అపార్టుమెంట్ వద్ద స్థానికులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులను మురుగు సమస్య తీర్చమంటే అపార్టుమెంట్ ఎత్తు పెంచమని ఉచిత సలహా పారేశారని అపార్టుమెంటు వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రజకులకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలి

● వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కరయ్య

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రజకులపై దౌర్జన్యాలు, దాడులు నిత్యం జరుగుతున్నాయని రజక వృత్తిదారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం భాస్కరయ్య అన్నారు. మంగళవారం ఉండవల్లి వీరనారి చాకలి ఐలమ్మ కల్యాణ మండపంలో జరిగిన సంఘ విస్తృత స్థాయి సమావేశంలో భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, కూటమి ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా సుబ్బారావు మాట్లాడుతూ ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో జరిగే రాష్ట్ర రజకవృత్తిదారుల మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, నేతలు ఉండవల్లి పార్థసారధి, శివయ్య, మస్తాన్‌రావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, శ్రీను, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సౌందర్య మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

● ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి



ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి

తాడేపల్లి (కొలనుకొండ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కుక్కమళ్ల సౌందర్య మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డీ రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం కుంచనపల్లిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సౌందర్య మృతి వార్త తెలుసుకున్న రమాదేవి సోమవారం రాత్రి ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలు పెరిగాయని, ప్రేమించి పెళ్లి చేసుకున్న సౌందర్య భర్త రాజు దుర్మార్గంగా సౌందర్యను హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. మృతురాలి భర్త, మామను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నేతలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, పి.గిరిజ, కొండపల్లి యశోద, శివపార్వతి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



క్షయవ్యాధి నివారణకు ఉత్తమసేవలు అందించినందుకుగానూ దుగ్గిరాల పీహెచ్‌సీ సిబ్బంది జీ శ్రీనివాసరావు, పీ స్వాతిలకు తెనాలి టీబీ యూనిట్ నుంచి డాక్టర్ పీ రవికుమార్, డీ రమాదేవిల చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. డాక్టర్ డీఎస్ రమాదేవి, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఇజాజ్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ సీ ఇందిర వీ సుబ్బారావు, సిబ్బంది అభినందించారు. **(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)**

కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీఎం మండల కార్యదర్శి షేక్ షమీ

పెదనందిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన నిర్వాహకులకు కనీస వేతనం రూ.10వేలు ఇవ్వాలని ఎండీఎం మండల కార్యదర్శి షేక్ షమీ అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞానకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు తెచ్చి మరీ విద్యార్థులకు భోజనాలు వండి పెడుతున్నామని, దీంతో అప్పుల్లో కూరుకుపోతున్నామని, ఒక్కో విద్యార్థికి రాగిజావ అందిస్తున్నామని. దీనికి ఏడాదిగా ప్రభుత్వం బిల్లులు చెల్లించట్లేదన్నారు. కార్మికులకు పీఎఫ్, హెల్త్‌కార్డులు, ప్రత్యేక దుస్తులు అందించాలని, ఉపాధ్యాయులు, నాయకుల వేధింపులు కార్మికులపై ఆపాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే త్వరలో ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మర్రి లక్ష్మీ, కె.శివలీల, అనూష, డి.జ్యోతి, కె.విజయలక్ష్మి, సీఐటీయూ నాయకులు దొప్పలపూడి రమేష్‌బాబు, కొత్త వెంకటశివ, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెడ్‌బుక్ డే

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలోని సీపీఎం, ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెడ్‌బుక్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజగురుల వర్ధంతిని పురస్కరించుకుని ఈ రెడ్‌బుక్ డే కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతుంటే వారిపై రాజ్యాంగ యంత్రాంగం దమనకాండకు పూనుకుంటుందని భావ స్వేచ్ఛ లేకుండా తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి, టీ బక్కిరెడ్డి, వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఆర్‌వి రాఘవయ్య, ఉండవల్లి పార్థసారధి, రామకృష్ణ, ఎస్‌వీ నారాయణ, కంచర్ల శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజాభివృద్ధికి సోపానాలుగా ఎదగాలి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి

దుగ్గిరాల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రతివిద్యార్థి సమాజాభివృద్ధికి సోపానాలుగా ఎదగాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జరిగిన ఫేర్‌వెల్‌డే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆలపాటి మాట్లాడుతూ ఎవరికి వారు తమను తాము ప్రశ్నించుకోకుంటే ఒకగొప్ప వ్యక్తిని కలవని వారిగా మిగిలిపోతారన్నారు. ఉద్యోగాల కోసం పోటీ ఉన్నప్పటికీ సమర్థులైన, కష్టపడే తత్వంగలిగిన వారు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని, జీవితంలో ఖచ్చితంగా స్థిరపడతారన్నారు. గ్రామీణప్రాంతంలో విద్యార్థులకు మంచి విద్యను అందించాలనే ఆలోచనతో కళాశాలను స్థాపించిన చందు రామారావు, విజయలక్ష్మిలను తొలుత అభినందించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, కళాశాలకు పేరుప్రతిష్టలను తేవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ, విద్యార్థులందరూ క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నతలక్ష్యాల సాధన దిశగా పయనించాలన్నారు. కరస్పాండెంట్ చందు విజయలక్ష్మి, డాక్టర్ కనగాల మధుసూదనరావు, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ప్రిన్సిపాల్స్ ఎన్ లక్ష్మీనారాయణ, రాఘవేంద్రవిష్ణు, వైస్ ప్రిన్సిపాల్ ఏ శ్రీకాంత్, హెచ్‌వోడీలు, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన క్లాప్ మిత్రాల శిక్షణ తరగతులు



క్లాప్ మిత్రాల శిక్షణలో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్

తాడికొండ(లాం), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి తాడికొండ మండలం లాంలోని సంపద తయారీకేంద్రం వద్ద నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛంగా ఉంచాలన్నారు. చెత్తకుప్పలను ఏర్పాటు చేయాలని, మురుగుకాల్వల్లో పూడికలు తీసయించాలన్నారు. ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించే విధంగా పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సేకరించిన చెత్త నుంచి తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద సృష్టించే విధంగా చూడాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే సమతావాణి, ఈవోపీఆర్‌డీ సాయిలీలా, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్, పెదకాకాని క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

క్రైస్తవులు, పాస్టర్లపై దాడులను అరికట్టాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జేఏసీ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో చర్చిలు, క్రైస్తవ ప్రతినిధులు, పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. రాజమహేంద్రవరంలో రహదారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన క్రిస్టియన్ సొసైటీ యాక్టివిస్ట్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, సోషల్ మీడియాలో రాధా మనోహర్ వంటి మతోన్మాదులు చేస్తున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలపై కేసులు నమోదు చేయాలని కోరారు. అనంతరం అనంతరం పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పలగాని తిమోతి, బెల్లంకొండ శివాజీరాజు, బొంతపురి రవిప్రకాష్, ప్రాతూరి సహదేవ్, ఏవీఎస్ మణి, గంటా మృత్యుంజయుడు, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి స్తంభోద్భవం



నృసింహుని స్తంభోద్భవ ఘట్టం

మంగళగిరి సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం రాత్రి అత్యంత కీలకమైన స్తంభోద్భవాన్ని ప్రదర్శించారు. హిరణ్యకశిపుడి సంహారార్థం శ్రీమన్నారాయణుడు నరుడు, నారాయణుడు కలిసి ఉగ్రనరసింహుడిగా.. తనను తాను సర్వాంతర్యామిగా చాటుకుంటూ స్తంభం నుంచి ఉద్భవించి అపూర్వ ఘట్టాన్ని దేవస్థానం అర్చకులు ఎంతో రమణీయంగా ప్రదర్శింపజేశారు. ఈ అలంకారోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరై గోవింద నామస్మరణతో జయ జయధ్వానాలు చేశారు. ఈ అలంకారోత్సవానికి మంగళగిరికి చెందిన రావూరి శ్రీనివాసరావు కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం ఈవో అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కవులకు అధ్యయనం అత్యవసరం

● కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి

గుంటూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాహిత్య రంగంలో రాణించాలనుకునే కవులు, రచయితలు తప్పనిసరిగా అధ్యయనం చేయాలని, అప్పుడే వారిలో సాహిత్యంపై సరైన అవగాహన ఏర్పడుతుందని కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. వేమన కవితామయం, తపస్వీ మనోహరం సంయుక్తంగా నిర్వహించిన కవితా సంపుటల పురస్కారాల ప్రదానసభ శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నారంశెట్టి హాజరై మాట్లాడుతూ.. భాష, భావం బలంగా చెప్పే అవకాశం దొరుకు తుందని, పరిశీలనా దృష్టితో చదివి అవగాహన చేసుకుని నిర్దిష్టమైన భావాలతో తమ గళాన్ని బలంగా వినిపించినప్పుడే సాహిత్య రంగంలో నిలదొక్కుకోగలరన్నారు. అనంతరం అతిథి చేతుల మీదుగా కుమార్ రాజును ఘనంగా సత్కరించి ఉగాది పురస్కారంను అందించారు. గుంటూరు జిల్లాకు చెందిన బుర్రి కుమార్ రాజుకు పురస్కారం లభించడంపై జిల్లా రచయితల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేసారు. పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలావృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాస లు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీరవెంకట సత్యనారాయ ణ), కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు)లకు నగదు బహుమ తులను అందించారు. కార్యక్రమానికి ఈ.వేమన అధ్యక్షత వహించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఆస్తి పన్ను వడ్డీపై 50శాతం రాయితీ: కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను వడ్డీపై 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 31 లోగా ఆస్తి పన్ను చెల్లించే వారికి పన్నుపై పడిన వడ్డీలో 50శాతం తగ్గిస్తారన్నారు. ఇప్పటికే పూర్తిగా వడ్డీతో చెల్లించిన వారికి ఈ రాయితీ సౌకర్యం వర్తింపజేస్తారు. పట్టణంలోని 40 వార్డుల్లో పురపాలక సంఘానికి చెల్లించాల్సిన పన్నుల బకాయిలను త్వరితిగతిన చెల్లించాలన్నారు. పన్నులు చెల్లిచాల్సిన వారు పురపాలక సంఘ కార్యాయలంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లను సంప్రదించి పన్నులు చెల్లించి తగిన రసీదు పొందాలని కోరారు.

నేటి నుంచి సదరం రీ వెరిఫికేషన్

తెనాలి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో వారంలో మూడు రోజులు నిర్వహించే సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభంకానుంది. గురు, శుక్ర వారాల వరకూ ఈ కార్యక్రమం జరగనుంది.

ఏప్రిల్ 7 నుంచి చివరి పరీక్షలు

తెనాలి అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 1 నుంచి 9వ తరగతి వరకు ఈ ఏడాది చివరి పరీక్షలు ఏప్రిల్ 7 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. 7న తెలుగు, 8 ఇంగ్లీష్, 9న హిందీ, 10న గణితం, 11న పి.ఎస్, 12న ఎం.ఎస్, 15న సోషల్, 16న సంస్కృతం పరీక్షలు జరుగుతాయి.

ఏప్రిల్ 1న జాతీయ నాటకోత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 14వ జాతీయ స్థాయి నాటకోత్సవాలు ఏప్రిల్ 1, 2 తేదీల్లో నిర్వహించనున్నారు. డీఎల్ కాంతారావు పోస్టల్ ఉద్యోగుల కళాపరిషత్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే నాటకోత్సవాలకు తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రంలో ప్రదర్శిస్తారు. 1న ఎన్టీఆర్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును రంగస్థల నటి కె.వి జయలక్ష్మికి ప్రదానం చేస్తారు. 1న సాంఘిక నాటకం జేబు చెప్పిన ఊసులు ప్రదర్శిస్తారు. 2వ తేదీన ది లెసన్ సాంఘిక నాటిక, శశిరేఖ పరిణయం, మాయబజార్ పద్యనాటకం ప్రదర్శిస్తామని పరిషత్ ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచార్యులు తెలిపారు.

'రైతులకు ఆహ్లాదం.. విజ్ఞానం కలిగేలా ఎడ్ల బలప్రదర్శన'

తెనాలి రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆహ్లాదం, వ్యవసాయంపై విజ్ఞానం కల్పించేలా ఎడ్ల బల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు కాకుమాను సాంబశివరావు చెప్పారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఆయన కార్యక్రమాల వివరాలను తెలిపారు. ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వరకూ ధర్మక్షేత్రం పేరుతో ఎడ్ల బల ప్రదర్శన జరుగుతుందన్నారు. ఇదే ప్రాంగణంలో వ్యవసాయంలో పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సోమవరపు నాగేశ్వరరావు, ముళ్లపూడి వెంకట్, ఎస్.చలపతిరావు, ఈదర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో దశావతార వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులు

దశావతార వేంకటేశ్వరుని సన్నిధిలో వైభవంగా హోమ కల్యాణం

పెదకాకాని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వరస్వామి వారి దివ్యక్షేత్రంలో మంగళవారం వైభవంగా పూజలు జరిగాయి. శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారికి సామూహిక హోమ కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణభాస్కరరావు దంపతులు, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రంలోని వృద్ధులకు శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రంలో ఎస్‌వీ యోగా సభ్యుడు, పాత్రికేయుడు వీరంకి భాస్కరావు 2వ వర్ధంతి సందర్భంగా వెలివెల శివరామకృష్ణ, వెంకటరెడ్డి, రమేష్ మిత్ర బృందం, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, నారాయణరావు, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

28న డాక్ అదాలత్

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీన డాక్ అదాలత్ నిర్వహిస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ గరికపూడి కరుణాకర్‌బాబు అన్నారు. విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ వారి ఉత్తర్వులు ప్రకారం ఈ నెల 28వ తేదీన డాక్ అదాలత్ నిర్వహిస్తామని పోస్టల్ సూపరింటెండెంట్ గరికపూడి కరుణాకరక్ బాబు తెలిపారు. తపాల సేవల్లో ఖాతాదారులకు ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక కొత్తపేటలోని సూపరిటెండెంట్ కార్యాలయంలో 28వ తేదీ ఉదయం గం.11.00లకు హాజరు కావాలని, హాజరు కావడానికి వీలులేనివారు 27వ తేదీలోపు తమ ఫిర్యాదులను లేఖ ద్వారా పోస్ట్ ఆఫీస్ సూపరిటెండెంట్, తెనాలి డివిజన్, తెనాలి-522201 చిరునామాకు పంపాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పూడిక తీయరు.. మురుగు పారదు...

● ఫాగింగ్ పొగతప్ప తొలగని దోమల బెడద ● గాడి తప్పుతున్న పారిశుధ్యం



ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద కాల్వలో వ్యర్థాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు పూడిపోయిన కాల్వ

తెనాలి అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో మురుగునీరు పారే కాల్వలు పూడిపోయాయి. మరికొన్ని చోట్ల వ్యర్థాలతో నిండిపోయాయి. రోజు మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడంతో పట్టణ పారిశుధ్యం గాడి తప్పుతోంది. ఫలితంగా దోమల బెడద పెరుగుతోంది. అప్పుడప్పుడు దోమల నివారణ కోసం చేస్తున్న ఫాగింగ్ పొగ తప్ప ఫలితం కనబడటం లేదని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టణ వీధులను శుభ్రంచేసే విషయంలో కూడా నిత్యం పారిశుధ్య సిబ్బందిని వినియోగించలేకపోతున్నారు. దీంతో పలు రహదారులు అపరిశుభ్రంగానే ఉంటున్నాయి. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లోనే ఈ పరిస్థితి కనబడుతున్నప్పటికీ శివారు ప్రాంతాల్లో చెప్పే పని లేదని విమర్శలు వస్తున్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయం ఎదుట మురుగు కాల్వ పూడిపోవడంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మూత్రశాల మురుగునీరు పారడం లేదు. కాల్వ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. చినరావూరు పార్కు రోడ్డులో కార్యాలయాల వెంబడి మురుగుకాల్వలు ఆకుల వ్యర్థాలతో నిండి వున్నాయి. పలుచోట్ల ప్లాస్టిక్ కవర్లు, టీ కప్పులు, ఇతర వ్యర్థాలు రోజుల తరబడి కాల్వల్లో కనిపించడం చూస్తే ప్రతిరోజూ శుభ్రం చేయాల్సిన కాల్వలు వారానికి ఒకటి రెండుసార్లు మాత్రమే శుభ్రం చేస్తున్నట్లు కనబడుతోంది. మురుగు కాల్వల్లో మురుగు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలకు ఆవాసాలు మారుతున్నాయి. వేసవి వచ్చినా దోమల బెడద తగ్గడం లేదు. ఆరుబయట రాత్రివేళల్లో దోమలు రక్తం పీలుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలలో పిచ్చిచెట్లు పెరిగిపోవడం, సమీప ఇళ్ల మురుగు చేరడం, దోమల బెడదను మరింత పెంచుతోంది. మురుగునీటిని పట్టణం వెలుపలకు తీసుకువెళ్లే ప్రధాన డ్రెయిన్లు కూడా ప్రతిరోజూ శుభ్రం చేయకపోవడంతో మురుగునీటి పారుదల నిలిచిపోతోంది. గతంలో పట్టణంలో ప్రధాన ప్రాంతాల్లో ప్రతివీధిని ప్రతిరోజు శుభ్రం చేసేవారు. ఈ పద్ధతి కొంతకాలంగా గాడి తప్పింది. వారానికి రెండు, మూడుసార్లు మాత్రమే రహదారులు శుభ్రం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి పట్టణ పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీపీ, షుగర్‌లపై జాగ్రత్తగా ఉండాలి

● మండల వైద్యాధికారి సుమంత్

కొల్లిపర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బీపీ, షుగర్‌ల విషయంలో తగినంత జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారి ఎస్.సుమంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హనుమాన్‌పాలెం గ్రామంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు మేరకు మందులు వాడుకోవాలన్నారు. ప్రతినెల నిర్వహించే ఎఫ్‌పీసీ క్యాంపులో మంచంలో ఉన్న వారికి కూడా ఇంటికి వెళ్లి వైద్యసదుపాయం కల్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్‌పీ జానీబేగం, ఏఎన్ఎంలు మేరిమ్మ, ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆషా కార్యకర్తలు నాగమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి



సచివాలయంలో రికార్డులను తనిఖీచేస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని చివలూరు, కొల్లిపర, అత్తోట సచివాలయాలను ఆమె తనిఖీ నిర్వహించారు. సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రోడ్లపక్కన చెత్త లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. నైదిబ్బలు తొలగింపుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్ల వేగవంతం చేయాలన్నారు. తనిఖీలో కార్యదర్శులు శ్రీలక్ష్మి, మాధురి, ఆలకనంద తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని యువకుడు మృతి చెందిన ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొల్లూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన పులి మహేష్(23) కొంతకాలంగా తెనాలిలోని సోదరి ఇంట్లో ఉంటూ కూలి పనులకు వెళుతున్నాడు. మహేష్ అవివాహితుడు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుని సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శివాలయంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

శివాలయం హుండీ ఆదాయం రూ.58.03 లక్షలు

పెదకాకాని, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రాంగణములో ఉన్న హుండీలను లెక్కించినట్లు ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్ మంగళవారం తెలిపారు. హుండీల లెక్కింపునకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా కాజ గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి పుణ్యాల వెంకటరెడ్డి హాజరయ్యారు. గడిచిన 109 రోజుల కానుకల ద్వారా రూ.58,03,497లు, అన్నదానం హుండీ రూ.2,89,270, బంగారం 0.054.300 మి.గ్రా, వెండి 0.438.000 గ్రాములు, విదేశీ కరెన్సీ ఆస్ట్రేలియా 20డాలర్లు, యు.యస్.ఎ. 139 డాలర్లు, ఇంగ్లాండు 10పౌండ్లు, నేపాల్ రూ.130, ఇండోనేషియా రూ.5000 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఉప కమిషనర్ తెలిపారు.

'క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి'

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ బోధకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ మోసిగంటి మంగళవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.



ఇఫ్తార్‌లో వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మంగళవారం పట్టణంలోని ఐతానగర్‌లో షేక్ జిలానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాలొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ఇఫ్తార్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనటం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

విధులకు న్యాయవాదుల గైర్హాజరు

తెనాలి క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు తగిన రక్షణ కల్పించాలని అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టును అమలుకు డిమాండ్ చేస్తూ మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు ప్రాంగణం వద్ద నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు వద్ద న్యాయవాది ఇజ్రాయిల్ దారుణ హత్య, పొన్నూరులో న్యాయవాదిపై పోలీసుల దాష్టికం, తమిళనాడులో న్యాయవాది కన్నన్‌ని కోర్టు ఆవరణలోనే కిరాతకంగా హత్య చేయడం తదితర సంఘటనలతో న్యాయవాదుల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోతోందని ప్రభాకర్ తెలిపారు. సీనియర్ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ, గతంలో ఏన్నడూ లేనివిధంగా న్యాయవాదులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్టును అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు గుమ్మడి రవిరాజు, మద్ది మల్లికార్జునరావు, కామినేని చిన్న, జి.పుణ్యవతి, కనపర్తి బెన్‌హర్, కొమ్ము అబ్రహంలింకన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలి

తెనాలి క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు తెనాలి బార్ అసోసియేషన్‌కు సకాలంలో ఎన్నికలు నిర్వహించాలని కోటా రమేష్‌బాబు ఇతర న్యాయవాదులు డిమాండ్ చేశారు. మంగళవారం కోర్టు ప్రాంగణం వద్ద జరిగిన సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ, ఫిబ్రవరి 19న బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్స్ ఈ నెల 30 లోపు ఎన్నికలు పూర్తి చేయాలని ఆదేశించిందన్నారు. తెనాలి బార్ అసోసియేషన్ ఇంతవరకు ఏ విధమైన ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టలేదని, ఎన్నికలు నిర్వహించకపోవడం బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆదేశాలకు విరుద్ధమన్నారు. వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు గొడవర్తి భాస్కరరావు, అనంత పరాంకుశం, పిట్టు విజయ్‌రెడ్డి, నన్నపనేని రవికృష్ణ, తిన్నలూరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

చైతన్యకు అంబేద్కర్ పురస్కారం

పొన్నూరు టౌన్, మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా వెనుకబడిన వారికి అండగా ఉంటూ సేవ చేస్తున్న న్యాయవాది మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం ఈ అవార్డును సేవ చేస్తున్న వారికి అందిస్తుంది. ఈ నెల 30న ఒంగోలు సమీపంలోని తూర్పునాయుడుపాలెంలో అంబేద్కర్ అవార్డును చైతన్యకు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ ఇఫ్తార్‌లో ప్రతి ముస్లిం పాల్గొనాలి

● మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్

పొన్నూరు టౌన్, మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఇస్తున్న ఇఫ్తార్ విందులో ప్రతి ముస్లిం పాల్గొని విజయవంతం చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ జాఫర్ మంగళవారం కోరారు. ఇఫ్తార్ విందులను బాయ్‌కాట్ చేయాలని ఎవరో ఒక వ్యక్తి ఇచ్చిన పిలుపునకు స్పందించవద్దన్నారు. దేశంలో ముస్లింలపై విద్వేషాలు పెంచడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి బాయ్‌కాట్‌లు మంచిదికాదన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో హిందూ, ముస్లింల మధ్య ఆత్మీయత, సోదరభావం పెంచేలా ఇఫ్తార్ విందులు దోహదపడతాయన్నారు. ఇలాంటి పవిత్రకార్యాన్ని బాయ్‌కాట్ చేయడం మంచిపద్ధతి కాదని సూచించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నందుకు చంద్రబాబు శత్రువు అయితే గత ఐదేళ్ల కాలంలో మోడీకి సరెండర్ అయ్యి సీఏఏ బిల్లుకు మద్దతు ఇచ్చిన జగన్ కూడా శత్రువే కదా అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యక్తిగతంగా ముస్లింలకు వ్యతిరేకంగా చేసిన ఒక్క హాని అయినా ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. సెక్యులర్ అయిన చంద్రబాబు 2014 నుంచి 2019వరకు బీజేపీతో పొత్తు ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలు ముస్లింలకు అమలు చేశారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు మొదటిసారి పెట్టినప్పుడు ఆమోదం పొందకుండా అడ్డుపడి జేపీసీ వేయడానికి ముఖ్య కారకుడు చంద్రబాబేనన్నారు. ఇప్పటికైనా ముస్లిం సమాజం మేల్కొని వాస్తవాలు గ్రహించాలని సయ్యద్ జాఫర్ విజ్ఞప్తి చేశారు.

చెత్త నుంచి సంపద సృష్టించుకోవాలి

● ఎంపీడీవో కొప్పాక లలిత

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టించుకునేలా అధికారులు పాలకులు కలిసి పనిచేయాలని ఎంపీడీవో కొప్పాక లలిత అన్నారు. చేబ్రోలు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు వద్ద మంగళవారం వట్టిచెరుకూరు మండలానికి చెందిన పలు గ్రామాల కార్యదర్శులు, క్లాప్, షెడ్ మిత్రలకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ తరగతులు జరిగాయి. తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల విక్రయం వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్ర అధికారి కె అనురాధ, వట్టిచెరుకూరు ఎంపీడీవో రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ పి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

27న జాబ్ మేళ

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి, 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాకు పలు సంస్థలు హాజరవుతున్నందున టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఆపై అర్హత కలిగిన అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవలసినదిగా సూచించారు. ఇతర వివరాల కోసం 9666545875 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, పక్కన ఆర్‌వో రాంప్రసాద్ తదితరులు

దుకాణాలకు నిర్వహించిన వేలం రద్దు

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో మునిసిపల్ షాపులకు నిర్వహించిన వేలంను రద్దు చేసినట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. మంగళవారం పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులతో కలసి ఎస్ఎస్ఎన్ పార్కుకు సంబంధించిన ఫుడ్ కోర్టు, కిడ్స్‌జోన్, సైకిల్ స్టాండ్, వెజిటబుల్ మార్కెట్ షాపులు, కబేళా సంబంధించిన లీజు కోసం వేలం నిర్వహించారు. వేలంకు వచ్చిన ప్రజలు తక్కువ మొత్తంకు పాడటంతో వేలంను రద్దు చేసినట్లు కమిషనర్ శేషన్న తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వో రాంప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

27న మునిసిపల్ షాపులకు బహిరంగ వేలం

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన మునిసిపల్ షాపులకు బహిరంగ వేలంను నిర్వహిస్తున్నట్టు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం తెలిపారు. 2025-2026 సంవత్సరానికి ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2026 వరకు మార్కెట్లలో రుసుము వసూలు చేసుకొను హక్కుకోసం ఈ నెల 27వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. కూరగాయల మార్కెట్లకి ధరావతు రూ.ఒక లక్ష, పండ్ల మార్కెట్టు ధరావతు రూ.10వేలు, చేపలు, కోళ్ళు, మాంసం మార్కెట్, జంతు వధశాలకు రూ.10వేలు, షాపు రూములు (3 సంవత్సరాల కాలానికి) ధరావతు రూ.10వేలు, సత్యనారాయణ మునిసిపల్ లేక్ పార్కులో ఫుడ్ కోర్టుకు రూ.10వేలు, వెహికల్ పార్కింగ్ ధరావతు రూ.10వేలు, క్యాంటీన్‌పై అంతస్థులకు ధరావతు రూ.10 వేలు ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయ పనివేళలో రెవెన్యూ విభాగంలో సంప్రదించాలని కమిషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



కొల్లిపరలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు, నాయకులు

పేద ముస్లింలకు దుస్తులు పంపిణీ

కొల్లిపర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో డాక్టర్ జాఫర్ సాదిక్ బాషా ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వంద మంది నిరుపేద మహిళలకు ఎస్ఐ కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు చినకోటిరెడ్డి, ముస్లిం నాయకులతో కలిసి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చినకోటిరెడ్డి మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి షేక్ ఖలీల్ అన్నారు. నిరుపేదలైన ముస్లిం కుటుంబాలకు ఖలీల్ లక్షలాది రూపాయలు ఖర్చుచేసి వారిని ఆదుకుంటున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు షేక్ ఇరఫాన్, షేక్ రహమ్‌తుల్లా, షేక్ హేతాన్ తదితరులు పాల్గొన్నారు.



కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ హరిణి, రవికుమార్ తదితరులు

ఫైలేరియా కిట్లు పంపిణీ

తెనాలి, మారీసుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బోదవ్యాధి సోకిన వారికి బోద వ్యాధి నివారణ సిబ్బంది నివారణ కోసం కిట్లను పంపిణీ చేశారు. స్థానిక మారీసుపేటలో మంగళవారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ దోనేపూడి హరిణి ఫైలేరియా అధికారులతో కలసి బోద వ్యాధి నివారణకు 32మంది ఫైలేరియా వ్యాధిగ్రస్థులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిణి మాట్లాడుతూ దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలలో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఇంటి పరిసరాల పరిశుభ్రతలు పాటించాలన్నారు. బోదవ్యాధి నివారణ కేంద్రం సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ వ్యాధి బాధితులు దగ్గరలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో వైద్యసాయం పొందాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ శివరామప్రసాద్, ఫీల్డ్ వర్కర్ రత్నాకరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రన్

పెన్షనర్ల సమస్యలపై ఐక్య పోరాటం

● అసోసియేషన్ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి

తెనాలి అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం చేస్తామని పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్ల అసోసియేషన్ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్రన్ పేర్కొన్నారు. కొత్తపేటలోని కాకతీయ సొసైటీలో డీఎల్ కాంతారావు వేదికపై మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘ గౌరవ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైద్య సదుపాయాల అంశంలో ఉన్న సమస్యలపై పోరాడతామన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్ల విధానాన్ని వివరించారు. దీనిపై కోర్టు తీర్పు కాపీలను రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు పంపిణీ చేశారు. సర్వీసు ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను ఎదుర్కోవాలన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసిరెడ్డి శివాజీ, నిమ్మగడ్డ నాగేశ్వరరావు, విద్యాసాగర్, రామారావు, బోసు, మోహనరావు, రాజారావు, బాబుజీ, కోటేశ్వరరావు ప్రసంగించారు.